తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

30 ఏళ్ల ప్రస్థానం వార్షికోత్సవం 1996 - 2026

# జంట మున్సిపాలిటీల... అభివృద్ధే లక్ష్యం

**- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ**



సూళ్లూరుపేట, మార్చి 13 ప్రభాతవార్త : నియోజక వర్గంలోని జంట మున్సిపాలిటీలైన సూళ్లూరుపేట, నాయుడు పేటలను అభివృద్ధి చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వెల్లడించారు. శుక్రవారం సూళ్లూరుపేట మున్సిపల్ సమావేశ మందిరంలో నిర్వహించిన బడ్జెట్ సమావేశంతో పాటు మున్సిపల్ పాలకవర్గ ఆఖరు సమావేశం కూడా కావడంతో ఈ కార్యక్ర మానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీని గత రెండేళ్లుగా అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నట్లు తెలిపారు. స్పెషల్ గ్రాంట్ కింద రెండు కోట్ల రూపాయలు తీసుకొచ్చి అవసరమైన చోట్ల సిమెంటు రోడ్లు, డ్రైనేజిల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే నాయుడుపేట మున్సిపాలిటీలో కూడా ఇదే విధంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో మంచినీటి సమస్య ఎక్కువగా ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్‌లో మంచినీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గతంలో నిలిచిపోయిన వాటర్ స్కీమ్ ప్రాజెక్టును తిరిగి త్వరలోనే ప్రారంభించనున్నట్లు చెప్పారు. 147 కోట్ల రూపాయలతో ఈ ప్రాజెక్టు వారు తిరిగి పనులు ప్రారంభించి పూర్తి చేస్తారని ఎమ్మెల్యే తెలిపారు. గత రెండేళ్లుగా సూళ్లూరుపేట మున్సిపాలిటీ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డితో పాటు పాలకవర్గ సభ్యులు ఎంతో హుందాగా వ్యవహరిస్తూ అభివృద్ధిలో భాగస్వాములు కావడం పట్ల ఆమె అభినందించారు. గత వైసీపీ ప్రభుత్వంలోనే కాకుండా ప్రస్తుత ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సారథ్యంలో మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేసినట్లు చెప్పారు. ఐదేళ్ల పాటు తనకు సహకరించిన కౌన్సిలర్లకు, అధికార యంత్రాంగానికి ఛైర్‌పర్సన్ శ్రీమంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్య, కౌన్సిలర్లు మీజూరు రామకృష్ణారెడ్డి, పముజుల విజయలక్ష్మి, కోఆప్షన్ సభ్యులు కళత్తూరు సునీల్‌కుమార్‌రెడ్డి, వైస్ ఛైర్మన్లు పోలూరు పద్మమ్మ, చిన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మేనేజర్ల నిర్వాకంతో...
# ఎపిసీడ్స్ మూత!

**-అన్నదాతల ఆశలు ఆవిరి -ప్రైవేటు కంపెనీలకు గోదాములు బాడుగకు**






ఆందోళన చేస్తున్న రైతులు, కార్మికులు

శ్రీకాళహస్తి,మార్చి 13 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి వ్యవసాయ దివ్యక్షేత్రంగా విరాలజిల్లుతుంది. ఇక్కడ రబీ సీజన్‌లో సుమారు 32 ఎకరాల్లో వరి, ఖరీఫ్ సీజన్లో సుమారు 32 వేల ఎకరాల్లో వాణిజ్యపంటలను పండించటం ఆనవాయితి. వాణిజ్య పంటల విత్తనాల సరఫరాకు 1976లో ఇక్కడ సుమారు 11 ఎకరాల విస్తీర్ణంలో 'ఆంధ్ర ప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థను రైతుల పెట్టుబడులతో నిర్మించారు. రూ.కోట్ల ఆస్తిని సుమారు 50 సంవత్సరాలు కాపాడుకకుంటూ వచ్చారు.అయితే ఇక్కడ కొందరు మేనేజర్ల కక్ష సాధింపుతో మూలపడింది. అంతేకాక కోట్ల రూపాయలు వెచ్చించి ఆవరణలో నిర్మించిన గోదాములను బాడుగకు ఇచ్చారు. అన్నదాతల ఆశలు ఆవిరియ్యాయి. విత్తనాభివృద్ధికి సంబంధించి మేలైన వంగడాలను తిరిగి తీసుకునే పద్దతిలో రైతులకు అందించిన సంస్థ ఉన్న పళంగా ఓ మేనేజర్ కక్షసాధింపుకు రైతులు, కార్మికులు బలి అయ్యే పరిస్థితి ఏర్పడింది.

శ్రీకాళహస్తిలో అన్నదాతలకు మేలైన వంగడాలను అందించుటకు ఎపిసీడ్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసారు. ఇక్కడ కమర్షియల్ పంటలుగా నాడు పండించిన జొన్న విత్తనాలను రైతులకు అందించటం వారు పండించిన పంటలను తిరిగి తీసుకోవటం పద్దతిలో వ్యాపారం ప్రారంభించారు. కోట్ల రూపాయల విలువ కల్గిన యంత్రాలు కొనుగోలు చేసారు. దీనితో పాటు రూ.10కోట్లు వెచ్చించి గోదాములను నిర్మించారు. ఎంతో సమర్ధవంతంగా నిర్వహించారు. మొదట పానగల్‌లోని ఓ ప్రైవేటు భవనంలో ఎపిసీడ్స్ తన కార్యక్రమాలను నిర్వహించి, దశల వారిగా అభివృద్ది చెందింది. కొంత కాలం జోన్న విత్తనాలను కమర్షియల్ పంటగా పండించారు. తరువాత వరి వంగడాలను బ్యాక్‌టు బ్యాక్ విధానంలో అందించారు. రైతులకు అందించటమే కాకుండా వారికి సలహాలు ఇవ్వటం అధిక దిగుబడులకు సూచనలు చేయటం వారు ఇచ్చిన విత్తనం పండించిన తరువాత సీడ్స్‌కార్పొరేషన్ సేకరించటం జరిగేది. అయితే తరువాత కొంత కాలం రైతుల డిమాండ్‌ను బట్టి వేరుశెనగ విత్తనాలను అందించారు. కార్పొరేషన్ భవిష్యత్తు కోసం గతంలో పాలకులు ప్రాకులాడారు.గత ఐదారు సంవత్సరాలుగా కార్పొరేషన్ పరిస్థితి విషమించింది. దశల వారిగా రైతులకు దూరం అవుతూ వచ్చింది.ఈ ఏడాది పూర్తిగా ధాన్యం సేకరణ లేకపోగా, పంపిణి కూడా లేదు. కానీ దీని భవిష్యత్తును పట్టించుకోవాల్సిన పాలకులు ఎందుకో గాలికి వదలివేసారు.

**ప్రైవేటు కంపెనీలకు బాడుగకు :**

శ్రీకాళహస్తి ఎపిసీడ్స్ కార్పొరేషన్ ఆవరణలో నిర్మించిన ఓ గోదామును మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాలతో బాట్లింగ్ కంపెనికీ బాడుగకు ఇచ్చారు. వారు శుక్రవారం వారి సరకులను దిగుమతి చేసుకున్నారు. ఇంత జరుగుతున్నా రైతుల పెట్టుబడులతో నిర్మించిన సంస్థను కార్పొరేషన్ తన ఇష్టాను సారంగా ఇక్కడ రైతుల సమావేశం ఏర్పాటు చేసిన వాస్తవ సరిస్థితిని వెల్లడించక ఏక పక్షంగా నిర్ణయాలు తీసుకుంటుంటే ఎందుకు ప్రజా ప్రతినిధి పట్టించుకోవటం లేదనేది చర్చనీయాంశంగా మారింది. అయితే ఆయన దృష్టికి తేచ్చే అధికారులు నిర్ణయం తీసుకున్నారా? అనే చర్చ జరుగుతుంది.

**రైతుల ఆందోళన:**

శ్రీకాళహస్తిలోని రైతుల పెట్టుబడులతో కోట్ల రూపాయల ఆస్తిని కార్పొరేషన్ అధికారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహారించటాన్ని ఖండిస్తూ బిసి నాయకుడు రైతులు వడ్లతాంగాళ్ బాలాజి ప్రసాద్‌రెడ్డి సారథ్యంలో ఎపిసీడ్స్ కార్పొరేషన్ ఆవరణలో ఆందోళన చేపట్టారు. అధికారులకు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో కష్టనష్టాలతో ఇక్కడ రైతులు పెట్టుబడులు పెట్టి వ్యవసాయానికి చేయూత ఉంటారని భావిస్తే కొందరు మేనేజర్స్ కక్ష సాధింపుతే రైతులకు సంబంధించిన సంస్థను మూత దిశకు రావటం శోచనీయం అన్నారు. ఈ ఏడాది ఎందుకు విత్తనాలను రైతులకు ఇవ్వలేదు? ఎందుకు సేకరించలేదు? ఎందుకు ఇక్కడి గోతాములను కూడా తరలించారు. పాలకులు ఎందుకు మౌనం వహించారు. ఇలా ఎన్నో ప్రశ్నలు తలెత్తుతున్నాయని బాలాజిప్రసాద్‌రెడ్డి వివరించారు. ఇక్కడ పరిస్థితిని ప్రభుత్వం అధ్యయనం చేసి తిరిగి సీడ్స్‌కార్పొరేషన్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని ఇక్కడ మూతకు ఒడిగట్టిన అధికారిపై విచారణ జరపాలని డిమాండ్ చేసారు. ఈ మేరకు మేనేజర్ జగదీష్‌కు వినతి పత్రం అందించారు. ఈ ఆందోళనలో బాలాజి ప్రసాద్‌రెడ్డితో పాటు మునెయ్య, ఈశ్వర్‌రెడ్డి, బాబు, మునిరామయ్య, రైతులు పాల్గొన్నారు.

# తిరుపతిలో భారత్ గ్యాస్ ఏజెన్సీ సీజ్

**- అనుమతి లేకుండా గో గ్యాస్ విక్రయం- భారీగా గ్యాస్ సిలిండర్లు స్వాధీనం**




తిరుపతిరూరల్, మార్చి13 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలంలోని అవిలాల గ్రామ పంచాయతీలో వున్న భారత్ గ్యాస్ ఏజెన్సీపై జిల్లా సివిల్ సప్లై శాఖ అధికారులు శుక్రవారం దాడి నిర్వహించి ఏజెన్సీని సీజ్ చేశారు. అనధికారికంగా గో గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా అధికారులు అకస్మికంగా తనిఖీలు చేపట్టారు. తనిఖీల సమయంలో ఏజెన్సీలో భారీగా గ్యాస్ సిలిండర్లు నిల్వ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అధికారుల వివరాల మేరకు శ్రీబాలాజీ టిటిడి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అండ్ కన్స్యూమర్ మ్యూచువల్లి ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నడుస్తున్న భారత్ గ్యాస్ ఏజెన్సీపై తనిఖీలు చేపట్టారు. భారత్ గ్యాస్‌కు సంబంధించి 230 ఫుల్ సిలిండర్లు, 82 ఖాళీ సిలిండర్లు, గో-గ్యాస్‌కు సంబంధించి 52 ఖాళీ సిలిండర్లు, కమర్షియల్ ఫుల్ సిలిండర్లు 595, ఖాళీ సిలిండర్లు 149ని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ మొత్తం సిలిండర్లను అధికారులు లెక్కించి స్వాధీనం చేసుకున్నారు. ఇలాంటి అక్రమాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని, ఎవరైనా అనుమతులు లేకుండా గ్యాస్ నిల్వలు ఉంచడం లేదా విక్రయాలు నిర్వహించడం గమనించినట్లయితే ప్రజలు వెంటనే సివిల్ సప్లై శాఖకు సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో జిల్లా సివిల్ సప్లై అధికారి శేషచలరాజు, ఏఎస్ఓ గంగయ్య, డిప్యూటీ తహశీల్థార్ సురేంద్ర, రూరల్ సివిల్ సప్లై అధికారి యుగంధర్, ఆర్ఐ రఘువర్మ, విఆర్వో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జనసేన నియోజక వర్గ ఇంచార్జి దౌర్జన్యం!

**- యర్రావారిపాలెంలో అనుచరులతో హల్చల్ -భూ వివాదంపై ఉద్రిక్తత**



ఉద్రిక్తత నెలకొన్న భూ వివాద స్థలం

యర్రావారి పాలెం, మార్చి 13, ప్రభాతవార్త: యర్రావారి పాలెం మండలంలో చంద్రగిరి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి దేవర మనోహర్ దౌర్జన్యం చేయడంతో భూ వివాదం పై తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. యర్రావారి పాలెం సంతగేటు సమీపంలో ఉన్న భూమి విషయంలో జనసేన ఇంచార్జి దేవర మనోహర్ అనుచరులతో శుక్రవారం హల్చల్ చేశారు..వివరాలు ఇలా ఉన్నాయి. యర్రావారిపాలెం మండలం, యర్రావారి పాలెం సంతగేటుకు ఎదురుగా ఉన్న యర్రావారి పాలెం రెవిన్యూ గ్రామానికి చెందిన యర్రా గుణసుందరి కి చెందిన సర్వే నంబర్ 1310/2ఏలో సుమారు 0.36 సెంట్ల స్థలంలోకి నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలతో చంద్రగిరి నియోజకవర్గ జనసేన ఇంచార్జి దేవర మనోహర్ తన అనుచరులతో కలిసి అక్రమంగా ప్రవేశించి యంత్రాలతో భూమిని చదును చేయడంతో భూ యజమానులు అడ్డుకోవడానికి ప్రయత్నించగా ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. గతంలో పలుమార్లు తన అనుచరులతో స్థలంలోకి దౌర్జన్యంగా ప్రవేశించి రాతి కుసాలను పగుల గొట్టారు. అప్పుడు బాధితులు అడ్డుపడటంతో వెనుతిరిగారు. ప్రస్తుతం అధికారాన్ని అడ్డుపెట్టుకొని భూయజమానుల బెదిరించడంతో భయ భ్రాంతులకు గురైన భూ యజమానులు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి దేవర మనోహర్, అతని అనుచరుల వల్ల తమకు ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేశారు. తమ భూమిలోకి అక్రమంగా చొరబడి పనులు నిర్వహిస్తున్నారని, తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. అదే విధంగా మండల రెవెన్యూ అధికారులను కూడా కలిసి తమ భూమిని ఆక్రమణదారుల నుంచి కాపాడాలని బాధితులు రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

# మేయరమ్మ... ఇకపై డాక్టరమ్మగానే సేవలు

**గత ఐదేళ్ళు మీ అందరి సహకారం, ప్రేమ, అభిమానం మరువలేను**

**-ప్రజా జీవితంలో రాజకీయంగా పొందిన సంతృప్తి చాలా గొప్పది**
**- -తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష అభిప్రాయం**




చివరి సమావేశం అనంతరం కార్పొరేటర్లతో మేయర్ గ్రూపు ఫోటో

తిరుపతి,మార్చి 13ప్రభాతవార్త: సామాన్య మధ్యతరగతి వర్గం నుండి వైద్యురాలిగా సేవలందిస్తూ రాజకీయ ప్రవేశంచేసిన డాక్టర్ ఆర్.శిరీష తొలిసారిగా తిరుపతి నగరపాలకసంస్థ కౌన్సిల్ మేయర్‌గా బాధ్యతలు చేపట్టడం విశేషం. గత ఐదుసంవత్సరాల పాలనలో ప్రజాజీవితంలో రాజకీయంగా పొందిన సంతృప్తి చాలా గొప్పదని ఆమె భావోద్వేగ ప్రసంగం చేయడం కౌన్సిల్‌లో కార్పొరేటర్లు, అధికారులను ఆలోచింపజేసింది. అన్ని రంగాల కన్నా రాజకీయ రంగంలోనే సమాజానికి గొప్పగా సేవ చేయవచ్చునేది,ఈ స్వల్ప రాజకీయ అనుభవం నేర్పిందని ఆమె అభిప్రాయం వెలిబుచ్చారు. కౌన్సిల్ సమావేశంలో ఉన్న వారు అందరూ గొప్ప వారేనంటూ, ఎవరికీ ఎవరూ తీసిపోరని ఆమె అనర్గళంగా మనసులో మాట తెలిపారు. తిరుపతి నగరానికి మేయర్ కావడం తనకు లభించిన అరుదైన గౌరవమని,మేయర్‌గా ఈ స్థానంలో కూర్చోబెట్టిన తిరుపతి నగర ప్రజలకు, కార్పొరేటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలంటూ ఉద్వేగపూరిత వ్యాఖ్యలు చేశారు. గత ఐదేళ్ళు మీ అందరి సహకారం, ప్రేమ, అభిమానం ఎప్పటికీ మరిచిపోలేనని అన్నారు. రాష్ట్రప్రభుత్వం నగరపాలక సంస్థలకు ప్రత్యేక అధికారులను నియమించడంతో తిరుపతి నగరపాలక సంస్థ కౌన్సిల్ పదవీకాలం ముగిసింది. శుక్రవారం ఉదయం ఎస్వీయూ సెనేట్‌హాల్‌లో చివరి కౌన్సెల్ సమావేశం జరిగింది. ప్రారంభ ఉపన్యాసంలో తొలిమేయర్, చివరి మేయర్ డాక్టర్ ఆర్.శిరీష మాట్లాడుతూ తిరుపతి మున్సిపాల్టీ నుండి నగరపాలక సంస్థగా ఏర్పడి ఐదు సంవత్సరాలు పూర్తయిందన్నారు. ప్రత్యేక కౌన్సిల్ సమా వేశంలో మేయర్ చివరి ప్రసంగం చేశారు. గత ఐదుసంవత్సరాల కౌన్సిల్ పాలనలో తీసుకున్న నిర్ణయాలు, జరిగిన అభివృద్ధి తిరుపతి గ్రేటర్ నగరంగా మారడానికి అడుగులు పడుతున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. 2021-26మధ్యకాలంలో తిరుపతి నగరపాలకసంస్థగా రూపుదిద్దుకుందని, తొలి కార్పొరేషన్ ఎన్నికలతో మేయర్, కార్పొరేటర్లుగా పదవులు ఏర్పడ్డాయన్నారు. గత ఐదేళ్ళలో మాకౌన్సిల్‌లో తిరుపతి నగర రూపురేఖలు మార్చేందుకు శ్రీకారం చుట్టామని ప్రతిష్టాత్మకంగా తెలిపారు. ఎంతో విశిష్టత ఉన్న తిరుపతి నగరానికి తొలి మేయర్ కావడం తనకు లభించిన అరుదైన గౌరవమన్నారు. తిరుపతి నగర పాలక సంస్థగా ఏర్పడిన తర్వాత మనదే మొదటి కౌన్సిల్ అని, గ్రేటర్‌గా మారితే గ్రేటర్‌కు ముందు మన కౌన్సిల్ మొదటిది, చివరిది అవుతుంద న్నారు. నగరంలో కొర్లగుంట సర్కిల్, గంగమ్మ గుడి సర్కిల్,బాలాజీ కాలనీ కూడలి, ఎం.ఆర్.పల్లి కూడలి వద్ద నలబడినా అక్కడ అభివృద్ధి చేశామని మనం గర్వంగా చెప్పుకునే విధంగా అభివృద్ధి చేపట్టామన్నారు. గత ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి సహకారం.. మన సహచర మాజీ ఉప మేయర్‌గా పనిచేసిన అభినయ్ రెడ్డి ప్రతిపాదనలు కీలకమన్నారు.తాను రాజకీయ కుటుంబానికి చెందిన వ్యక్తిని కాదని, ఒక సాధారణ డాక్టర్‌నన్నారు. గురువారెడ్డి లాంటి గొప్పవారు చైర్మన్ గా పనిచేసిన ప్రాంతం ఇదన్నారు. శ్రీవారి పాదాల చెంత నెలకొన్న నగరం ఈ నగరానికి ప్రథమ పౌరురాలు కావడం అసాధారణ విషయమేమీ కాదన్నారు. ఎలాంటి రాజకీయ అనుభవం లేని తనను నిత్యం ప్రోత్సహించి వెన్నుదన్నుగా నిలిచిన తన భర్త డాక్టర్ మునిశేఖర్, మా నాన్న, అమ్మ నా ఇద్దరు పిల్లలు ఇచ్చిన సహకారం తోనేను సాఫీగా నా మేయర్ బాధ్యతలను నిర్వహించగలిగానని ఆమె ఒకింత సంతోషంగా తెలిపారు.తనతో పనిచేసిన కమిషనర్ల ప్రోత్సాహం,సహకారం అద్వితీయమన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, అదికారులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. చివరగా నగరపాలక కౌన్సిల్, అదికారులతో గ్రూప్‌ఫోటో దిగారు. అనంతరం మేయర్‌గా క్లిష్టసమయంలోనూ పరిస్థితులకు అనుగుణంగా మెలగడంలో డాక్టర్ శిరీష అందరికీ ఆదర్శంగా నిలిచారు.

# 3 విడతల్లో ప్రతి రైతుకు రూ.20 వేలు

**- 2.05 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.400 కోట్లు జమ**

**- రైతులను ఆదుకోవడంపై ప్రత్యేక దృష్టి - పిఎం కిసాన్-అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు**



రైతులకు పిఎం కిసాన్-అన్నదాత సుఖీభవ నిధుల చెక్‌ను రైతులకు పంపిణీ చేస్తున్న కలెక్టర్ , ఎమ్మెల్యే

చిత్తూరు, మార్చి 13 ప్రభాతవార్త: జిల్లాలోని ప్రతి రైతుకు 3 విడతల్లో పిఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పథకం కింద 20 వేల రూపాయల నిధులు వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు జమ అవుతాయని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు పేర్కొన్నారు. గుడిపాల మండలం ఎన్‌ఆర్‌పేట జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు పిఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పథకం నిధులు రైతుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు జమ చేసే కార్యక్రమంను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు మాట్లాడుతూ జిల్లాలో మైక్రో ఇరిగేషన్ విధానంలో ప్రస్తుతం 8 వేల హెక్టార్లలో హార్టికల్చర్ సాగు అవుతోందని, మరో 20 వేల హెక్టార్లలో హార్టికల్చర్ పంటలు సాగుకు అవకాశాలు వున్నాయన్నారు. అలాగే ఇప్పటికే రైతులకు ఇన్పుట్ సహాయం నిమిత్తం అన్నదాత సుఖీభవ మొదటి, రెండవ విడతల్లో రూ.14 వేలు డిబిటి పద్దతిలో నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం 3వ విడతలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.4 వేలు నిధులు మంజూరు చేసిందన్నారు. పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం కింద మొదటి, రెండవ, మూడవ విడతల్లో జిల్లాలోని 2.10 లక్షల మంది రైతుల బ్యాంకు కాతాలకు రూ.400 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. జిల్లా రైతుల సూక్ష్మ నీటి సాగు పద్దతులు అవలంబించాలని, దీని ద్వారా పలు ఉపయోగాలు వున్నాయన్నారు. జిల్లాలో ప్రధాన పంటలతో పాటు ఉద్యాన పంటలు, పాడి పరిశ్రమపై రైతులు దృష్టి కేంద్రీకరించాలన్నారు. రైతులు పండించిన పంటకు మార్కెటింగ్ సౌకర్యం అధికారులు కల్పిస్తారన్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడు రైతు పక్షపాతి అని, ప్రతి రైతు ముఖంలో సంతోషం చూడాలని సూపర్ సిక్స్‌లో అన్నదాత సుఖీభవ పథకంను పొందుపరిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్‌చౌదరి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, సింగిల్‌విండో ఛైర్మన్ ప్రతాప్‌నాయుడు, మాజీ ఎంపిపి దీపశ్రీ, తహసిల్దారు శ్రీనివాసులు, ఎంపిడిఓ శిరీష, ఇతర అధికారులు, స్థానిక నాయకులు, పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

## వేద విజ్ఞాన పీఠం ఆగమ విద్యలకు సంజీవని

**-శృంగేరీ శారదా పీఠం విధుశేఖర భారతి'స్వామి**



తిరుమల,మార్చి 13ప్రభాతవార్తప్రతినిధి: వేద విజ్ఞాన పీఠం ప్రాచీన కాలం నుండి వేద, శాస్త్ర, ఆగమ విద్యలకు సంజీవనిగా నిలుస్తోందని శృంగేరీ శారదా పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి స్వామి తెలిపారు. ధర్మగిరిలోని వేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠంలో నిర్వహించిన 29వ వేంకటేశ్వర వేద శాస్త్ర ఆగమ విద్వత్ సదస్సు ముగింపుకు ఆయన పాల్గొన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన 313 మంది విద్యార్థులను సన్మానించి విజయ పత్రికలను ప్రదానం చేశారు.

## కీసరగుట్ట వేద విజ్ఞాన పీఠంలో...టిటిడి చైర్మెన్



తిరుమల,మార్చి 13ప్రభాతవార్తప్రతినిధి: హైదరాబాద్ సమీపంలోని కీసరగుట్టలోని శ్రీ వేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠాన్ని టిటిడి ఛైర్మెన్ బి.ఆర్. నాయుడు శుక్రవారం సందర్శించారు. టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న వేద పాఠశాల గురించి టిటిడి ఛైర్మెన్ వివరాలు తెలుసుకున్నారు.

# అన్నదాత పిఎం కిసాన్‌తో రైతులు అభివృద్ధి కావాలి

**-తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్**



నియోజకరవర్గంలో ఐదు మండలాల రైతులతో సమావేశం అయిన కలెక్టర్

రైల్వేకోడూరు, మార్చి 13 ప్రభాతవార్త : అన్నదాత సుఖీభవ ప్రధానమంత్రి కిసాన్ ను రైతన్నలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్ అన్నారు. శుక్రవారం రైల్వే కోడూరు మండల అభివృద్ధి కార్యాలయంలో 202526వ మూడవ విడత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే కోడూరు నియోజకవర్గం కిందన ఐదు మండలాలకు చెందిన రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి రైతు ఉగాదిని పురస్కరించుకొని ప్రభుత్వ అందిస్తున్న అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ ను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి పదంలో పయనించాలని కలెక్టర్ కోరారు. ప్రతి రైతు ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ విత్తనాలు, ప్రభుత్వ పథకాలు ద్వారా మరింత అభివృద్ధిని సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం రైతును రాజు చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రము నుండి అన్నదాత సుఖీభవ, కేంద్రం నుండి ప్రధానమంత్రి కిసాన్ ఏర్పాటు చేశారని ఆయన అన్నారు. రానున్న కాలంలో ప్రభుత్వం మంజూరు చేస్తున్న పథకాలను ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకొని భావితరాలకు స్ఫూర్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతి రైతు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలను వాడుకొని అభివృద్ధి లోకి చేరాలని కోరారు. రైల్వే కోడూరు నియోజకవర్గానికి 24,622 మందికి 9.85కోట్లు రైతుల ఖాతాలోకి జమ చేయడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా కోడూరులో 4885, పుల్లంపేటలో 4415, ఓబులవారిపల్లి లో 5269, పెనగలూరు లో 5074, చిట్వేలి మండలంలో 4979 మంది రైతులు ఉన్నారని ప్రతి రైతుకు పిఎం కిసాన్ నుండి అన్నదాత సుఖీభవ నుండి 6000 రూపాయలు చొప్పున మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో రైల్వే కోడూరు టిడిపి నాయకులు రూపనంద రెడ్డి, వ్యవసాయ జేడీ ప్రసాద్ రావు, రైల్వే కోడూరు జనసేన రాష్ట్ర నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, కోడూరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పగడాల వరలక్ష్మి, కోడూరు వ్యవసాయ అధికారి సందీప్, కోడూరు తాసిల్దార్ అమర్నాథ్, ఎంపీడీవో జయశ్రీ, ఆర్ ఐ లక్ష్మీదేవి, పంచాయతీరాజ్ డి ఈ బాల నరసింహులు తో పాటు కూటమికి చెందిన తల్లెం రమణారెడ్డి, గడికోట సుబ్బరాయుడు, పోకల బాబు, పటాన్ మోలా, గంగరాజు వెంకటేశ్వరరాజు, పందేటి వెంకటరామరాజు, సురప రాజు పల్లి సుబ్బరాజు, సుంకేసుల రెడ్డి బాబు, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ మల్లికార్జున రాజు, ఏపిఎం వసుంధర, ఆర్డబ్ల్యూఎస్ జేఈ రమేష్, హౌసింగ్ మురళి తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డ్వాక్రాసంఘాలకు వరం ఫుడ్‌బాస్కెట్ కార్యక్రమం

కుప్పం, మార్చి 13 ప్రభాతవార్త:



డ్వాక్రా సంఘాల్లోని మహిళలకు ఫుడ్‌బాస్కెట్ కార్యక్రమం ఓ వరం లాంటిదని టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం చందం గ్రామంలో ఫుడ్ బాస్కెట్ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళల్లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా పోషకాహార లోపాన్ని తగ్గించేందుకే సిఎం చంద్రబాబునాయుడు ఫుడ్ బాస్కెట్ కార్యక్రమంను అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికంగా లభ్యమయ్యే వివిధ ఆహార పదార్థాల వినియోగంతో పాటు గ్రామీణ స్థాయిలో మెరుగైన ఆరోగ్యం, పోషణ ఫలితాలు సాధించేందుకు ఫుడ్ బాస్కెట్ ముఖ్య ఆధారంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమం అమలుకు ఎంపికైన గ్రామాలకు లక్ష రూపాయల నిధులు సంఘాల ద్వారా వినియోగించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ, డిపిఎం అమృతవల్లి, ఎపిఎం చంద్రశేఖర్, కో క్లస్టర్ ఇన్‌చార్జ్ గాయత్రి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి వార్షికోత్సవం

కుప్పం, మార్చి 13 ప్రభాతవార్త :



స్థానిక పాతపేటలో నెలకొని ఉన్న శ్రీ ప్రసన్న వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఆర్యవైశ్యులచే ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి విశేషాలంకరణ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు మహానీరాజనాలు సమర్పించారు. శ్రీవాసవి పీఠం పీఠాధిపతి శ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతిస్వామివారు అమ్మవారికి గణంగా పూజా కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వామివారు ప్రవచనాలు బోధించారు. కార్యక్రమంలో మంజునాథ షాపింగ్ మాల్ అధినేత ప్రమోద్, ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ

శాంతిపురం, మార్చి 13 ప్రభాతవార్త:



మండలంలోని రాళ్లబూదుగూరు హైస్కూల్‌లో విద్యార్థులకు రెసో z డైరెక్టర్ బసవరాజు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. బసవరాజు పెద్దకుమారుడు కిరణ్ జ్ఞాపకార్థం విద్యార్థులకు రాత అట్టలు, నోట్ పుస్తకాలు, జామెట్రీ పుస్తకాలు అందించారు. పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

గుడుపల్లె, మార్చి 13 ప్రభాతవార్త:




ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ సూచించారు. శుక్రవారం గుడుపల్లెలో ప్రజలకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. కారు నడిపేవారు సీట్ బెల్ట్ తప్పక ధరించాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటించడంతో పాటు వాహనాలు నిర్ణీతవేగంతో నడిపి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. అనంతరం హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించిన వారిని అభినందిస్తూ రోజాపూలతో అభినందించారు.

## పేదలకు రంజాన్ తోఫా పంపిణీ

వి.కోట, మార్చి 13 ప్రభాతవార్త:

మండల పరిధిలోని పేద ముస్లిం మైనార్టీలకు స్థానిక అఖిల్ ట్రేడింగ్ కంపెనీ యాజమాన్యం ఆధ్వర్యంలో రంజాన్ తోఫాను అందజేశారు.రాబోవు రంజాన్ పర్వదినాన ముస్లిం మైనార్టీ లందరూ సంతోషంగా పండుగను జరుపుకోవాలని తోఫాను అందజేస్తున్నట్లు ట్రేడర్స్ యజమాని అఖిల్ తెలిపారు. దాదాపు 500 మంది ముస్లిం మైనార్టీలకు శుక్రవారం తమ శక్తి మేరకు అందజేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు ఆయాజ్,జాకీర్, అమానుల్లా,పజిల్,ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులే రేపటి దేశ...భవిష్యత్తుకు పునాదులు

పుల్లంపేట, మార్చి 13 ప్రభాతవార్త :



మండలంలోని ఆదర్శ మోడల్ స్కూల్లో శుక్రవారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల అభివృద్ధి అధికారిని జయశ్రీ మండల తెలుగుదేశం పార్టీ సంచాలకుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు హాజరై విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈనాటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తుకు పునాదులని, క్రమశిక్షణతో మంచి విద్యను అభ్యసించి మంచి అలవాట్లను నేర్చుకోవాలి అన్నారు. వేసవి సెలవులు అంటే విద్యార్థులందరికీ ఆనందంగా ఉంటుందని సెలవు రోజుల్లో కొంత సమయం చదువుకు కేటాయించిపై తరగతి లపై ముందుగా తర్ఫీదు కావాలన్నారు. దీంతో మీరు చదివిన చదువులకు పాఠశాలకు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు వస్తాయని వారన్నారు. మోడల్ స్కూల్ 13వ వార్షికోత్సవంలో వివిధ క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులకు పుల్లంపేట ఎస్సై చిన్న రెడ్డప్ప బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి చక్రధర్ రాజు, తిరుమల రావు ప్రిన్సిపల్ లీలా శ్రీహరి వైస్ ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి

పలమనేరు, మార్చి 13 ప్రభాతవార్త:



ప్రముఖ కవయిత్రి స్వర్గీయ మొల్లమాంబ జయంతిని పలమనేరులో శాలివాహన (కుమ్మరి) సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మొల్లమాంబ చిత్రపటానికి కమీషనర్ కెవి. రమణారెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి సంస్కృతంలో రచించిన రామాయణాన్ని తెలుగులో అనువదించి తెలుగువారికి అందజేసిన ఘనత మొల్లమాంబకే దక్కుతుందన్నారు. నేడు రామాయణం పిల్లల నుండి పెద్దల వరకు శులభశైలిలో చదువుకుంటున్నారంటే ఆ ఘనత మొల్లమాంబకే దక్కుతుందని వివిరంచారు. జై మొల్లమాంబ, జైజై మొల్లమాంబ అంటూ శాలివాహనులు నినాదాలు చేశారు.

## చిత్తూరు ఆసుపత్రిలో చెలరేగిన మంటలు

చిత్తూరుహెల్త్, మార్చి 13 ప్రభాతవార్త:



చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో రోగులు, వైద్యాధికారులు, సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పాడుబడిన ఆరు 108 వాహనాలను నగరానికి చెందిన ఓ స్క్రాప్ వ్యాపారి టెండరు దాఖలు చేసి దక్కించుకున్నాడు. ఆ వ్యాపారి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో వున్న పాడు పడిన 108 వాహనాలను తీసుకెళ్ళడానికి గ్యాస్ కట్టర్ ద్వారా కట్ చేయడానికి కూలీలకు అప్పగించాడు. ఈ క్రమంలో కూలీలు గ్యాస్ కట్టర్‌తో 108 వాహనాలను కోస్తుండగా ఒక్కసారిగా వాహనాల నుండి మంటలు చెలరేగాయి. కార్మికులు కట్టర్ చేస్తున్న 108 వాహనంతో పాటు ప్రక్కనే వున్న మరొక వాహనంకు మంటలు అంటుకోవడంతో ఆ వాహనం సైతం దగ్ధమైంది. ఆసుపత్రి ఆవరణలో వున్న రెండు 108 వాహనాలు ఒక్కసారిగా దగ్ధం కావడంతో ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చిన రోగులు, ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది బిత్తరపోయారు. రెండు 108 వాహనాలు దగ్ధం కావడంతో ఆసుపత్రి ఆవరణ మొత్తం పొగతో అలముకుంది. ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో సత్వరం స్పందించిన అగ్నిమాపక శాఖ సిబ్బంది హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటి వరకు భయాందోళనలతో కొట్టుమిట్టాడిన ఆసుపత్రి రోగులు, వైద్యులు సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

## మహిళలు గౌరవించబడే భూమి పుణ్యభూమి

యాదమరి, మార్చి 13 ప్రభాతవార్త:



మహిళలు పూజించబడే భూమి పుణ్యభూమి అవుతుందని యాదమరి పిహెచ్‌సి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ పేర్కొన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం యాదమరి పిహెచ్‌సిలో విధులు నిర్వహించే మహిళా సిబ్బందిని డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన కాలంలో పురుషులు, మహిళలకు తారతమ్యం వుండేదని ప్రస్తుత సమాజంలో స్త్రీ, పురుషులకు ఎలాంటి వ్యత్యాసాలు వుండటం లేదన్నారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్తున్నారన్నారు. మునాని వైద్యాధికారి డాక్టర్ తులసీ మాట్లాడుతూ పిహెచ్‌సి సిబ్బంది కలిసికట్టుగా విధులు నిర్వహిస్తున్నారని, ఈ వాతావరణం తనకు ఎంతో సంతృప్తి ఇస్తోందన్నారు. సిహెచ్‌ఓ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా ముందుకు సాగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి ప్రభుత్వ మహిళా ఉద్యోగుల సంఘం శైలజ, ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బంగారుపాళ్యం తాలుకా అధ్యక్షుడు సురేంద్రనాథ్‌రెడ్డి, పిహెచ్‌ఎన్ నిర్మల, హెల్త్ సూపర్‌వైజర్ సెల్వరాణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పిలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన మహిళా వైద్య సిబ్బందిని డాక్టర్ అనిల్‌కుమార్‌నాయక్ సన్మానించారు.

## రూ.30 కోట్లతో గుడిపాల అభివృద్ధి

– ఎంపిపి మండల దేశం అధ్యక్షులు



గుడిపాల, మార్చి 13 ప్రభాతవార్త:

చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారని, ఒక్క గుడిపాల మండలంలోనే ఈ రెండేళ్ళలో రూ.30 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేశారని ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్ చౌదరి, మండల తెలుగుదేశం అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడులు పేర్కొన్నారు. మండల కేంద్రం గుడిపాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరు మాట్లాడుతూ జిజెఎం ట్రస్ట్ ద్వారా నిరంతరం పేద ప్రజలకు సేవ చేస్తున్న ఎమ్మెల్యేపై ఎవరైనా ఆరోపణలు చేస్తే సహించమని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడుపై ప్రతిపక్ష వైకాపా నేతలు దోపిడిదారుడని, నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరుగడం లేదని బురద చల్లడం మానుకోవాలన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడుకు దోపిడి చేయాల్సిన అవసరం లేదని, అభివృద్ధి పనులపై ప్రజాక్షేత్రంలో తేల్చుకోవడానికి తాము సిద్ధంగా వున్నామని, ఈ విషయంపై వైకాపా నాయకులు స్పష్ట ఇవ్వాలన్నారు.

## పలమనేరు రూరల్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలమనేరు, మార్చి 13 ప్రభాతవార్త:

పలమనేరు రూరల్ మండలంలో రెండో శనివారం కావడంతో ఈనెల 14న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఇ ఇ.అర్జున్ తెలిపారు. 33 కెవి సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

## టెన్త్ పరీక్షలకు 11 పరీక్షా కేంద్రాలు

కుప్పం, మార్చి 13 ప్రభాతవార్త:

ఈనెల 16నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు కుప్పం మండలంలో 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు ఎంఇఒలు కుమారి, రాజారాం తెలిపారు. మండలంలోని అడవిబూదుగూరు, పొనా ్నంగూరు, చందం, గోనుగూరు, పైపాళ్యం, కుప్పం పట్టణంలోని బాలుర, బాలికల హైస్కూళ్లు, విజయవాణి, విద్యోదయ, మాంట్‌ఫోర్ట్ స్కూల్, ఆర్.పేట తెలుగు పాఠశాలల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. మండలంలో మొత్తం 1399మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. పరీక్షా కేం ద్రాల్లో ఉన్నతాధికారుల ఆదేశాలతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు చెప్పారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సాయం వెలకట్టలేనిది

– శ్రీదుర్గా మృతిపై రాజకీయం చేయడం తగదు

– జాతీయ బిసి సంక్షేమ సంఘ ప్రధానకార్యదర్శి షణ్ముగం

చిత్తూరురూరల్, మార్చి 13 ప్రభాతవార్త:



చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తమ కుటుంబానికి అందించిన సాయం, సహకారం వెలకట్టలేనిదని మాజీ టౌన్‌బ్యాంక్ ఛైర్మెన్, జాతీయ బిసి సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి షణ్ముగం పేర్కొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతూ మృతి చెందిన తెలుగుదేశం పార్టీ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి శ్రీదుర్గా మృతిపై వైఎస్‌ఆర్‌సిపి నేతలు రాజకీయం చేయడం తగదన్నారు. శుక్రవారం చిత్తూరులోని జాతీయ బిసి సంక్షేమ సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైకాపా పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా వైఎస్‌ఆర్‌సిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ విజయానందరెడ్డి తమ కుమార్తె శ్రీదుర్గా మృతిపై ఎమ్మెల్యే తన ట్రస్టు ద్వారా ఎటువంటి ఆర్థికసాయం అందించలేదని విమర్శించడం విడ్డూరంగా వుందన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన తన కుమార్తెకు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి, అపోలో ఆసుపత్రిలలో సరైన వైద్యం అందించకపోవడంతో మృతి చెందినట్లు పోస్టుమార్టం ద్వారా తెలిసిందని, ఈవిషయంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ సహకారంతో అపోలో యాజమాన్యంపై మూడునెలలు పోరాటం చేసానని, ఈ పోరాటానికి మద్దతు ఇవ్వాలని అన్ని రాజకీయపార్టీలను కోరినప్పటికీ వైఎస్‌ఆర్‌సిపి ఇన్‌ఛార్జీ విజయానందరెడ్డి స్పందించకపోగా ఈ రోజు నా కుమార్తె మరణాన్ని గురించి మాట్లాడుతుంటే విడ్డూరంగా వుందన్నారు. ఎమ్మెల్యే ట్రస్టు నుండి ఆర్థికసాయం అందించలేదని విమర్శించడం సరైంది కాదని, తన కుటుంబానికి ఎమ్మెల్యే వారి కుటుంబసభ్యులు ఎప్పటికప్పుడు అండగా నిలుస్తున్నారని, ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పినా తాము సున్నితంగా తిరస్కరించనట్లు పేర్కొన్నారు. శ్రీదుర్గా కర్మకాండ కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు సొంత కుటుంబంలా ఆదరించారని, అంత్యక్రియలు పూర్తయ్యేవరకు ఎమ్మెల్యే కుటుంబం, జిల్లా కలెక్టరు తమ కుటుంబానికి అండగా వున్నారన్నారు. విమర్శలు చేస్తున్న విజయానందరెడ్డి మాజీ టౌన్‌బ్యాంక్ ఛైర్మెన్, వైసిపి నాయకులు రామ్‌గణేష్ శబరిమలలో చనిపోయి ఇంటికి తీసుకుని వచ్చినప్పుడు అక్కడి వెళ్లిన విజయానందరెడ్డి తమ ట్రస్టు ద్వారా ఆర్థికసాయం ఎందుకు చేయలేదన్నారు. శ్రీదుర్గా జ్ఞాపకార్థం సంతపేట నుంచి బర్రెల గ్రౌండ్ వరకు రూ. 38లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టి ఆ రోడ్డుకు శ్రీదుర్గా స్ట్రీట్ అని పేరు పెట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసారన్నారు. అలాగే పార్టీతరపున రూ. 5లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందించారన్నారు. చిత్తూరు నగర అభివృద్దిని చూసి ఓర్వలేక కొందరు బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు ప్రతిదీ గమనిస్తున్నారని, ఇకపై అసత్య ఆరోపణలు మాని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు సహకారాన్ని అందించాలని, అసత్య ఆరోపణలు చేస్తూ పత్రికల ముందు ప్రకటనలు చేస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని షణ్ముగం హెచ్చరించారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైసిపి విమర్శలు

– చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత

చిత్తూరురూరల్,మార్చి 13 ప్రభాతవార్త:



చిత్తూరు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం హయాంలలో జరుగుతున్న అభివృద్దిని చూసి ఓర్వలేకనే వైసిపి నేతలు విమర్శలు చేస్తున్నారనీ చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత వైసిపి పాలనలో జల్లా కేంద్రమైన చిత్తూరు నగరం ఎలాంటి అభ్రివృద్దిని నోచుకోలేదనేది జగమెరిగిన సత్యమన్నారు. గత రెండు సంవత్సరాలుగా చిత్తూరు నియోజకవర్గం అభివృద్దిలో పరుగులు తీస్తున్నదని, నగరపాలక సంస్థ పరిధిలోకి వచ్చిన నగర శివారు ప్రాంతాలను గత వైసిపి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆ ప్రాంతాల ప్రజలు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఎంపి ప్రసాదరావు ఆధ్వర్యంలో ఆప్రాంతాలకు తాగునీరు, రోడ్డు సదుపాయాలు కల్పించారన్నారు. అలాగే జిల్లా కేంద్రాన్ని విద్యా, పారిశ్రామిక పరంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ముందడుగు వేయడం జరిగిందనీ, ఇందులో భాగంగా ఎంతో ప్రతిష్టాత్మకమైన కేంద్రీయ విద్యాలయం చిత్తూరుకు మంజూరై ఈ విద్యాసంవత్సం నుంచి తరగతులు కూడా ప్రారంభం కానున్న విషాన్ని వైసిపి నేతలు తెలుసుకోవాలన్నారు. అస్తవ్యస్తంగా వున్న చిత్తూరు ఫారెస్టురోడ్డును నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చింది కూటమి ప్రభుత్వమేనని, తిరుమల పవిత్రతను దెబ్బతీసి ప్రపంచవ్యాప్తంగా హిందువులు మనోభావాలను దెబ్బతీసిన ఘనత వైసిపి ప్రభుత్వనిదేనని, పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను సైతం మూసివేసి ఎపేదల కడుపుకొట్టిందన్నారు. పేదల ఆకలిబాధలు తీర్చాలన్న ఉద్దేశంతో అన్నా క్యాంటీన్లను పునఃప్రారంభిమని, వైసిపి నేతలు వాస్తవాలను తెలుసుకొని కూటమి ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు.

## గట్టుపై జారిపడి రిటైర్డ్ ఏఎస్ఐ మృతి

వి.కోట, మార్చి 13 ప్రభాతవార్త:



మండల కేంద్రమైన వి.కోట సమీపంలోని దాసార్లపల్లి సమీపంలో ప్రమాదవశాత్తు హంద్రీనీవా కాలువ గట్టుపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి కాలువ గట్టుపై నుండి క్రింద పడిన సంఘటనలో ఓ రిటైర్డ్ ఏఎస్ఐ మృతి చెందారు.స్థానికుల కథనం మేరకు వివరాలిలా..కర్ణాటక రాష్ట్రం ముల్బాగల్ పట్టణం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన టీవీ శ్రీనివాసులు (65)కు వి.కోట సమీపంలోని గాండ్లపల్లి వద్ద సొంత వ్యవసాయ పొలాలు కలవు.శుక్రవారం ద్విచక్ర వాహనంలో తమ వ్యవసాయ పొలాల వద్దకు హంద్రీనీవా కాలువ గట్టుపై నుండి వెళుతుండగా ప్రమాదవశాత్తు తమ వ్యవసాయ పొలం సమీపంలో కాలువ గట్టునుండి శ్రీనివాసులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం జారి క్రింద పడింది.ఈ ప్రమాదంలో శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు.తాను జారిపడిన విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించినట్లు వారు తెలిపారు. సంఘటన స్థలానికి సన్నిహితులు చేరుకునే లోపే అతను మృతి చెందారు.మృతుని కుమారుడు, కోడలు,కుమార్తె అల్లుడు నలుగురు వైద్యులు కావడం విశేషం.ఈ మేరకు పోలీసులకు సమాచారం అందిచారు.

## తప్పిపోయి జనావాసాల్లోకి జింక

వి.కోట, మార్చి 13 ప్రభాతవార్త:



అటవీ ప్రాంతం నుండి తప్పిపోయి జనా వాసాల్లోకి జింక చొరబడిన సంఘటన శుక్రవారం ఉదయం వి.కోటలో చోటుచేసుకుంది.అటవీ అధికారుల కథనం మేరకు కర్ణాటక సరిహద్దుల్లో నుంచి ఓ మగజింక మామిడి తోపులు మీదుగా మార్కెట్ సమీపంలో జనావాసాల్లోకి రాగానే కంగారు పడి ఓ దుకాణంలోకి దూరింది. అటవీ శాఖకు దుకాణ యజమాని సమాచారం ఇవ్వగానే వెంటనే మార్కెట్ యార్డుకు వెళ్లి పరిశీలించగా అనారోగ్యంగా ఉన్నట్లు గుర్తించారు.వెంటనే మంచినీరు త్రాగించి సౌకర్యాలు చేశారు.అది మగ జింకగా నిర్ధారించుకుని వెంటనే ఆటోలో మండలంలోని నార్త్ బీట్ అటవీ ప్రదేశం కి తరలించారు.మరల అడవిలో స్వేచ్ఛగా తిరిగేందుకు అడవిలో విడిచి పెట్టినట్లు బీట్ అధికారి శేఖర్ తెలిపారు. కొంతసేపటికి దాని కదలికలను అధికారులు గమనించి ఆరోగ్యంగా ఉందని నిర్ధారించుకున్న అటవీ సిబ్బంది జింక అటవీ ప్రాంతంలోకి వెళ్లడంతో అధికారులు వెనుతిరి గారు

## ప్రమాదాల నివారణకు చర్యలు... ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు

పలమనేరు, మార్చి 13 ప్రభాతవార్త:



జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పలమనేరు పరిసర ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినట్లు పలమనేరు సిఐ మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద పలమనేరుతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి ట్రాక్టర్లు రప్పించి రేడియం స్టిక్కర్లు అతికింప జేశారు. మూడు రోజుల్లో ఈ కార్యక్రమం పూర్తి చేయాలని లేదంటే ట్రాక్టర్ల యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాక్టర్లు రహదారిలో వెళ్ళేటపుడు రాత్రిళ్ళలో వెలుతురు లేక పోవడం వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. ఇందుకు ట్రాక్టర్ల వెనుక వైపు ట్రాలీలకు ముందు వైపు ఇంజన్ల వద్ద రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేస్తే ఇతర వాహనాల లైట్ల వెలుతురు స్టిక్కర్లపై పడుతుందని దీంతో కొంతవరకైనా ప్రమాదాల నివారించే అవకాశం ఉందన్నారు.

## శ్రీవారి దర్శనంతో చాలా సంతోషం : ఎమ్మెల్సీ శ్రీకాంత్



తిరుమల,మార్చి 13ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని, తిరుమల క్షేత్రంలో మనసు భక్తిభావంతో ఉప్పొంగుతుందని ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. దంపతులిద్దరూ శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

## డిజిటల్ మార్కెటింగ్‌పై అవగాహన

యూనివర్సిటీ(తిరుపతి),మార్చి 13ప్రభాతవార్త:



డిజిటల్ మార్కెటింగ్ ప్రాధాన్యం, సోషల్ మీడియా మార్కెటింగ్, కంటెంట్ క్రియేషన్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్, ఆన్ లైన్ బ్రాండింగ్, డిజిటల్ కాంపెయిన్‌ల రూపకల్పన వంటి అంశాలపై విద్యార్థినులకు శిక్షణ నిచ్చారు. పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం కమ్యూనికేషన్, జర్నలిజం విభాగం విద్యార్థినులకు డిజిటల్ మార్కెటింగ్ పై ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమాన్ని చెన్నైకి చెందిన ఈజ్ నార్ స్టూడియోస్ నిపుణుడు రంజిత్ భువనేశ్వరన్, శ్రీమాధ్యురాజ్‌లు నిర్వహించారు. కృత్రిమ మేధస్సు ఆధారిత డిజిటల్ మార్కెటింగ్ కార్యకలాపాలను కూడా నిర్వహించడం విశ్లేషించడం వంటి విషయాలను కూలంకుషంగా చర్చించారు. ముగింపు సమావేశంలో సోషల్ సైన్సెస్ డీన్ ఆచార్య సి.వాణి,విభాగాధిపతి ఆచార్య టి.త్రిపురసుందరి పాల్గొని విద్యార్థినులకు సర్టిఫికెట్లను అందజేశారు.

## ఎస్‌పిఎంవివిలో ఫ్రైడే దినోత్సవం

యూనివర్సిటీ(తిరుపతి),మార్చి 13ప్రభాతవార్త:



పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం గణిత విభాగం ఆధ్వర్యంలో ఫ్రైడే దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్వీయూ గణిత శాస్త్ర విభాగం ప్రొఫెసర్ డి.భారతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గణిత విభాగ విద్యార్థులు ప్రదర్శించిన వినోద గణిత నమూనాలను పరిశీలించారు.గణిత రంగంలో వివిధ గణిత శాస్త్రజ్ఞుల జీవిత సహకారాల గురించి ఆమె క్లుప్తంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డా.సి.వెంకటలక్ష్మి ్మ, సహాయ ఆచార్యులు డా.ఎం.శివ పార్వతి, అధ్యాపకులు డా.బి.విశాలి, డా.కె. మంజుల, డా.పి.డి.సెల్వి, డా.ఎ.శోభ, విద్యార్థులు పాల్గొన్నారు.

## లబ్ధిదారుల వద్ద ఉన్న రికార్డులను నమోదు చేయాలి

కేవీబీ పురం, మార్చి 13 ప్రభాతవార్త:




మండల కేంద్రమైన కేవీబీ పురంలో మండలంలో జరుగుతున్న ఏడు గ్రామాల్లో రీ సర్వేపై లబ్ధిదారులకు భూమి వివరాలను రెవెన్యూ సిబ్బందికి తహసీల్దార్ తనూజ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం భూమిపై ఎవరున్నారు వాటి వివరాలన్ని, డీకేటీ భూముల బాట పోరంబోకు, కాలువ పోరంబోకు తదితర వివరాలను పరిశీలనలో తప్పక తీసుకోవాలని తెలిపారు. ఎలాంటి వాటికి లొంగకుండా వివరాలను సేకరించాలని గ్రామ సర్వేయర్లను గ్రామాల్లో రీ సర్వే చేయాలని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ వాసంతిరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, కరుణాకర్, మండల అసిస్టెంట్ ఆఫీసర్ మళ్లీ, రఘు, కృష్ణయ్య, పలువురు వీఆర్‌వోలు, వీఆర్ఏలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో మహిళలకు ఆరోగ్యం

వడమాలపేట, మార్చి 13 ప్రభాతవార్త:



హెచ్‌పీవీ టీకాతో మహిళల్లో రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా జీవించవచ్చునని వడమాలపేట మెడికల్ ఆఫీసర్ హర్షవర్ధన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సినేషన్ కార్యక్రమం జరిగింది. ప్రధానంగా యుక్త వయస్సులో ఉన్న బాలికలను లక్ష్యంగా చేసుకుని రూపొందించబడిన ఈ వ్యాక్సినేషన్ 14,15 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఇంజెక్షన్ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్లు హర్షవర్ధన్, సందీప్‌లు మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ భవిష్యత్‌లో గర్భాశయ క్యాన్సర్ నివారణలో అత్యంత ప్రతిభావంతంగా పని చేస్తుందన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజలకు సమాచారాన్ని చేరవేయడం, లబ్ధిదారులను సమీకరించడం వారి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో పురుషోత్తంరెడ్డి, సూపర్‌వైజర్ మురళి, మంజుల, లలితమ్మ, భారతి, వెంకటరాజు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలపై అవగాహన

– విద్యార్థులకు ట్రాఫిక్ పోలీసుల మార్గదర్శనం



తిరుపతి,మార్చి 13ప్రభాతవార్త: పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రత అంశాలపై ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. శుక్రవారం తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీ పి.రామకృష్ణమాచారి ఆధ్వర్యంలో సిఐ సంజీవకుమార్ ట్రాఫిక్ నిర్వహణ విధానం, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం ప్రాముఖ్యత, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, జీబ్రా క్రాసింగ్‌ను సక్రమంగా ఉపయోగించడం వంటి అంశాలను వివరించారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తిరుపతి లోని ఆర్‌ఎస్ మాడా వీధి నగరపాలక ఉన్నతపాఠశాల లో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనగలూరు, మార్చి 13 ప్రభాతవార్త :



తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం మండలంలో నేడు శనివారం 220 రాజంపేట టౌన్, రాజంపేట, నందలూరు, పెనగలూరు చిట్వేల్ మరియు ఓబులవారీ పల్లి మండలాలలోనీ అన్ని 33 కే వి సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉదయం 08 గంటల నుండి సాయంత్రం 5 గంటలవరకు విద్యుత్ సరఫరా ఉండదు కావున విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సంస్థకు సహకరించవలసిందిగా కోరుతున్నాము.అదే విధం గా వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు శనివారం ఉదయం 2.00 గంటల నుంచి 8.00 గంటల వరకు త్రీఫేస్ సప్లై ఇవ్వబడును మరియు గృహ వినియోగదారులు కూడా తాగునీటికి ఇంటి అవసరాల కొరకు నీటిని నింపుకోవాల్సిందిగా రాజంపేట ఆపరేషన్ ఏ పి ఎస్ పి డి సి ఎల్ ఈ ఈ ఎస్ రాజశేఖర్ రెడ్డి తెలపడం అయినది

## గ్యాస్ గోదాం ను పరిశీలించిన ఎమ్మార్వో.

చిట్వేలి, మార్చి 13, ప్రభాతవార్త:



స్థానిక మండల పరిధిలోని ఇండెన్ గ్యాస్ గోదాంను ఎమ్మార్వో స్పందన శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో నిల్వ ఉంచిన గ్యాస్ సిలిండర్ల భద్రతా ప్రమాణాలు, నిల్వ విధానం మరియు అగ్నిప్రమాద నివారణకు తీసుకున్న జాగ్రత్తలను పరిశీలించారు. గోదాంలో ప్రస్తుతం ఉన్న నిల్వ వివరాలు, పెండింగ్ బుకింగ్స్, రాబోయే డెలివరీ బుకింగ్స్ తదితర విషయాలను కూడా తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు.గ్యాస్ సిలిండర్ల నిల్వ మరియు పంపిణీ విషయంలో ప్రభుత్వం నిర్దేశించిన భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలని, నిర్ణీత సమయంలో వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలని ఎమ్మార్వో స్పందన ఆదేశించారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యు.నిఖిల్ కుమార్, గ్రామ వీఆర్వో నరసింహులు పాల్గొన్నారు.

## గాంధీపురంలో వసూళ్లపై...రాజకీయ దుమారం

–వైసిపి నాయకులపై టిడిపి మండిపాటు

తిరుపతిరూరల్, మార్చి13 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం గాంధీపురం గ్రామ పంచాయతీలో గత వైసిపి ప్రభుత్వ హయాంలో మఠం భూములు అన్యాక్రాంతానికి గురయ్యాయని, వివిధ పనుల పేరుతో ప్రజల నుంచి వేల రుపాయాలు వసూలు చేశారని టిడిపి నాయకులు తీవ్ర ఆరోఫణలు చేశారు. గాంధీపురం టిడిపి అధ్యక్షుడు యనమల ధన రాయల్ మీడియాతో మాట్లాడుతూ అప్పటి వైసిపి నాయకులు నో–అబ్జెక్సన్ సర్టిఫికేట్, ఇంటి పన్నులు, కరెంట్ మీటరు వేల రుపాయాలు వసూళ్లు చేసి, ప్రజలపై ఆర్థిక భారం మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజ్ వ్యవస్థ, నీటి పైప్‌లైన్ పేరుతో కూడా గ్రామస్తుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం అదే వైసిపి నాయకులు, కూటమి నాయకులపై బోర్లు, ఇంటి పన్నులు కోసం డబ్బులు వసూలు చేస్తున్నారంటూ ఆరోఫణలు చేయడం 'దొంగే దొంగ అన్నట్టు' ఉందని ధన రాయల్ మండిపడ్డారు. గతంలో జరిగిన అక్రమాలపై సమాధానం చెప్పకుండా ప్రజల దృష్టి మళ్లించేందుకు వైసిపి నాయకులు కూటమిపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించిన వసూళ్ళు, మఠం భూముల అన్యాక్రాంతంపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ కోశాధికారి రమేష్, జిల్లా కార్యధర్శి ఎలికా ధనంజయ యాదవ్, సెక్సన్ ఇన్‌చార్జి పత్తి మునికృష్ణ, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారిగా నవీన్‌కుమార్

తిరుపతి, మార్చి 13 ప్రభాతవార్త:



తిరుపతి బార్ అసోసియేషన్ 2026- 27 సంవత్సరానికి నిర్వహించనున్న ఎన్నికల కోసం సీనియర్ న్యాయవాది ఎస్.నవీన్ కుమార్‌ని ఎన్నికల అధికారిగా నియమించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొట్టి రాజేంద్ర తెలిపారు. మార్చి 12న జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలను ఈ నెల 31 లోపు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఛైర్మన్ నల్లారి ద్వారకానాథరెడ్డి ఆదేశాల మేరకు సంవత్సరం మార్చి నెలలో బైల ప్రకారం ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికలు పూర్తయిన అనంతరం కొత్తగా ఎన్నికైన కార్యవర్గ సభ్యుల వివరాలను బార్ కౌన్సిల్‌కు పంపించాలని తెలిపారు.

## తెలుగు భాషలో ఆమె రచనలు గొప్పతనం

తిరుపతి,మార్చి 13ప్రభాతవార్త:



సాధారణ ప్రజలకు అర్థమయ్యే సరళమైన తెలుగు భాషలో కవయిత్రి మొల్ల రచనలు చేయడం ఆమె గొప్పతనమని రాయలసీమరంగస్థలం కళాకారులు వివరించారు. ఆమె రచించిన తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిన మహత్తర కావ్యం రామాయణమని పేర్కొన్నారు.తెలుగు కవయిత్రి మొల్ల 586వ జయంతి వేడుకలు కవయిత్రి మొల్ల విగ్రహ కమిటీ ఛైర్మన్ వెంకట కేశవులు ఒడియార్ ఆధ్వర్యంలో శుక్రవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా కవయిత్రి మొల్ల విగ్రహ కమిటీ సభ్యులు, రాయలసీమ రంగస్థలి కళాకారులు,ఆమె విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పుష్పాలతో అలంకరించి ఘనంగా పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలం ఛైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కార్యదర్శి కేఎన్ రాజ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, వెంకట కేశవులు ఒడియార్, కళాకారులు , వివిధ సంఘాల నాయకులు కొట్టే సుబ్రహ్మణ్యం రెడ్డి, చిత్రప హనుమంతరావు, రమణ, పురోహితుడు సురేష్ స్వామి, మస్తానమ్మ , రఫీ, పొన్నాల జేజి రెడ్డి, సునీల్ నాయక్, టిడిపి నాయకులు దంపూరు భాస్కర్ యాదవ్,జగన్నాథం పాల్గొన్నారు.

## గ్యాస్ కొలత లేదు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

**బాలాయపల్లి, మార్చి 13 ప్రభాతవార్త :** వంట గ్యాస్ కొరత లేదని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శ్రీకాళహస్తి సబ్ కలెక్టర్ భాను ప్రకాష్ రెడ్డి తెలిపారు. గ్యాస్ బుకింగ్, పంపిణీ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసి ఆన్లైన్ రికార్డులను, స్టాక్ నుసబ్ కలెక్టర్ భాను ప్రకాష్ రెడ్డి, తహసిల్దార్ విజయలక్ష్మి పరిశీలించారు. వినియోగదారులకు గ్యాస్ కొరత ఉందా లేదా అని సిబ్బందిని అడిగి సబ్ కలెక్టర్ అడుగగా గ్యాస్ కొరత లేదని తగినంత స్టాక్ ఉందని, మరో లోడ్ వస్తుందని సిబ్బంది ఆర్డిఒకు తెలిపారు. బాలాయపల్లి తహసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి ఆన్లైన్ రికార్డులు, రీ సర్వేపై పై తహసీల్దార్ విజయలక్ష్మిని శ్రీకాళహస్తి సబ్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.



తహసీల్దార్ విజయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ శిరీష, విఆర్వోలు, రెవిన్యూ సిబ్బందితో పలు అంశాలపై సమావేశం నిర్వహించి, సూచనలు చేశారు. ప్రజలకు సకాలంలో నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు.ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అధికారులచే ఆక్రమణల తొలగింపు

బైరెడ్డిపల్లి, మార్చి 13 ప్రభాతవార్త :

బైరెడ్డిపల్లి మండల కేంద్రంలో నేషనల్ హైవే రోడ్డువెడల్పుచేసే క్రమంలో భాగంగా రోడ్డుకు ఇరుప్రక్కల ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టినటువంటి ఇల్లు షాపులకు సంబంధించిన ప్రదేశానికి హద్దులను నిర్ణయించడం జరిగినది.ఈ సందర్భంగా నేషనల్ హై అధికారులు మాట్లాడుతూ ట్రాఫిక్ ఎక్కువ అయినందున, వాహనాలు నడపడానికి ఇబ్బంది కలుగుతున్నదని,అటు ఇండియన్ బ్యాంకు నుండి చెక్ పోస్ట్ కూడలి చెన్నై టు బెంగళూరు బస్టాండ్ లింకు రోడ్డు వరకు,రోడ్డును ఆక్రమించుకున్న వారికి నోటీసులు జారీ చేయనున్నారు. రెండు రోజులలో ఆక్రమణలు తమకు తాముగా తొలగించాలని లేనిపక్షంలో విధించి జరిమానాలు విధించి ఆక్రమణలను తొలగించడం జరుగుతుందని నేషనల్ హైవే అధికారులు తెలియజేశారు.

## హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమం

పుల్లంపేట, మార్చి 13 ప్రభాతవార్త :



స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు శుక్రవారం హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మండల అభివృద్ధి అధికారిని జయశ్రీ పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి స్థానిక వైద్య అధికారులు పాల్గొని గర్భాశయ క్యాన్సర్ కట్టడికి హ్యూమన్ పాపిల్లోమా వైరస్ టీకా అందుబాటులోకి వచ్చిందని నేటి నుంచి ఈ కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని వారన్నారు. హెచ్ పి వి టీకాలను బాలికలకు 14 ఏటా ప్రారంభం నుండి 15 ఏండ్లు దాటని బాలికలు అర్హులని పుల్లంపేట మండల వ్యాప్తంగా సుమారు 402 మంది అర్హత కలిగిన వారు ఉన్నారని ఈ కార్యక్రమం 90 రోజులపాటు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల పర్యవేక్షణలోనే నిరంతరంగా జరుగుతుందని వారు తెలిపారు. ఇప్పటివరకు మండల ఆరోగ్య కేంద్రంలో 120 డోసులు ఉన్నాయని మండలంలో అర్హులైన బాలికలకు వారి తల్లిదండ్రుల అనుమతులతో గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ రహిత మండలంగా తీర్చిదిద్దామని వైద్యులు సానె శేఖర్, మనోజ్ చంద్ర వైద్య సిబ్బంది సుబ్బారెడ్డి ఏఎన్ఎంలు పాల్గొన్నారు

## హెచ్‌పివి వాక్సినేషన్ కార్యక్రమం

పెనగలూరు, మార్చి 13 ప్రభాతవార్త:



తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పెనమలూరు మండలం పెనగలూరు పీహెచ్‌సీలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమం ప్రారంభం–వైద్యుల ఆధ్వర్యంలో అవగాహన అన్నమయ్య జిల్లా పెనగాలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని వైద్యాధికారి డాక్టర్ తౌసిఫ్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. బాలికలను గర్భాశయ ముఖ క్యాన్సర్ నుండి రక్షించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తౌసిఫ్ మాట్లాడుతూ హెచ్‌పీవీ వైరస్ వల్ల మహిళల్లో గర్భాశయ ముఖ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, చిన్న వయస్సులోనే టీకా వేయించడం ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తౌసిఫ్ డాక్టర్ శ్రేయ, డాక్టర్ జవహర్ యునాని తదితర వైద్యులు పాల్గొని టీకా ప్రాముఖ్యతపై వివరించారు. ముఖ్యంగా 9 నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా అందజేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు అపోహలు నమ్మకుండా తమ పిల్లలకు తప్పనిసరిగా టీకా వేయించాలని వైద్యులు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ టీకా పూర్తిగా సురక్షితమైందని, మహిళల ఆరోగ్య రక్షణలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

## ప్రతి రైతు కుటుంబానికి అన్నదాత సుఖీభవ : ఎమ్మెల్యే




గంగవరం,మార్చి 13, ప్రభాతవార్త : రైతుల భూములకు సంపూర్ణ భద్రత కల్పించడమే..ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మాజీ మంత్రి,పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఎమ్పీడివో కార్యాలయ ఆవరణలో ఉగాది కానుకగా పీఎం కిసాన్–అన్నదాత సుఖీభవ మూడవ విడతను విడుదల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గోన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగు భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.14000,కేంద్ర ప్రభుత్వం రూ.6000 ఏడాదికి రూ.20000 వంతున ఆర్థిక సాయం అందిస్తుందన్నారు.3వ విడతలో భాగంగా పలమనేరు నియోజకవర్గంలోని 38,368 మంది రైతులకు రూ.21.71 కోట్లు జమ చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.రైతులకు లాభదాయక సాగు విధానాలను ప్రోత్సహిస్తూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ,సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం సమర్ధవంతంగా అమలు చేస్తుందని తెలిపారు.రాయలసీమను ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దుతూ..గతంలో కరువు ఇబ్బందులు ఎదుర్కొన్న రాయలసీమను ఉద్యాన హబ్‌గా మార్చే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆయన పేర్కొన్నారు.ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని పేర్కొన్నారు.పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి గోదావరి పుష్కరాల నాటికి జాతికి అంకితం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.గత పాలనలో భారీగా ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిన రైతులకు భూ వివాదాలు తప్పలేదని,అలాగే రైతుల భూములను 22ఎ కింద పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని ఆయన విమర్శించారు.ఇటీవలే మీ భూమి మీ హక్కు కార్యక్రమం ద్వారా రైతులకు రాజముద్రతో,విశిష్ట భద్రత పీచర్లతో కూడిన పాస్ పుస్తకాలను పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు.భూమి రైతుకు నమ్మకం,విశ్వాసం,అమ్మతో సమానమని,తాతలు,తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూములపై ఎవరూ అక్రమంగా హక్కు చెలాయించకుండా భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేకంగా రాయలసీమ ప్రాజెక్టులు అన్నిటిని అభివృద్ధి చేస్తూ రాయలసీమను రతనాల సీమగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ఆశయమని ఆయన అన్నారు.వైసీపీ నాయకులు గతంలో రైతుల పట్ల చిన్నచూపు చూసి మళ్ళీ ప్రజల్లో కపట ప్రేమతో ప్రాజెక్టుల పర్యవేక్షణ అంటూ వైసీపీ నేతలు చెపుతున్న మాటలకు ప్రజలు నమ్మి మోసపోవద్దని ప్రజలను కోరారు.ప్రజా సమస్యల పరిష్కారం,రైతుల సంక్షేమం,రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ఛైర్మన్ ప్రసాద్‌నాయుడు,టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు రామచంద్రనాయుడు,జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్‌చౌదరి,మండలాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడు,ప్రధాన కార్యదర్శి నూతన కాల్వ ప్రతాప్‌కుమార్‌రెడ్డి,ఎస్సీ సెల్ అధ్యక్షుడు టి.రవి, నాయకులు సురేష్‌చౌదరి,బత్తిగౌడు,ఏఓలు గీతా,హేమలత,సంధ్య,రఖీభాలతో పాటు తదితరులు పాల్గోన్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank Together we can
చౌడేపల్లి శాఖ (13179), చిత్తూరు జిల్లా సెల్: 8333034097, 7032002707

### బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలముగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు తెలియజేయడమేమనగా మీరు మా బ్యాంకు వద్ద బంగారు నగలు తాకట్టు పెట్టి పొందిన రుణమును తిరిగి చెల్లించలేదు. పలుమార్లు నోటీసులు పంపిననూ బట్వాడా కాకుండా తిరిగి వచ్చినది. **23.03.2026** వ తేది లోపు బకాయిలు,ఇతర ఛార్జీలను చెల్లించి తనఖా వుంచిన సెక్యూరిటీలను తిరిగి పొందగలరు. లేనియెడల బ్యాంకు శాఖ ఆవరణంలో **తేది:24.03.2026 సా.4.00గం॥లకు** లేదా బ్యాంకు నిర్ణయించిన ఏదేని తేదీలలో వేలం వేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు.

| వ. నెం. | ఖాతానెం. | రుణగ్రహీత పేరు & చిరునామా | బంగారు బరువు (గ్రాములలో) | బకాయి మొత్తం ఛార్జీలతో రూ. |
|---|---|---|---|---|
| 1 | 180157097628 | జి.రేఖ, 7-146, గోసులకూరపల్లి గ్రామం, చౌడేపల్లి మండలం, చిత్తూరు జిల్లా -517257 | 19.00 | 92,312.59 |

చౌడేపల్లి, తేది:13.03.2026 సం॥ బ్రాంచ్ మేనేజర్, కెనరా బ్యాంకు

కెనరా బ్యాంక్ Canara Bank Together we can
సూళ్లూరుపేట శాఖ (13474), సూళ్లూరుపేట సెల్: 9440905298, 9746930929

### బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలముగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు తెలియజేయడమేమనగా మీరు మా బ్యాంకు వద్ద బంగారు నగలు తాకట్టు పెట్టి పొందిన రుణమును తిరిగి చెల్లించలేదు. పలుమార్లు నోటీసులు పంపిననూ బట్వాడా కాకుండా తిరిగి వచ్చినది. **23.03.2026** వ తేది లోపు బకాయిలు,ఇతర ఛార్జీలను చెల్లించి తనఖా వుంచిన సెక్యూరిటీలను తిరిగి పొందగలరు. లేనియెడల బ్యాంకు శాఖ ఆవరణంలో **తేది:24.03.2026 సా.4.00గం॥లకు** లేదా బ్యాంకు నిర్ణయించిన ఏదేని తేదీలలో వేలం వేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు.

| వ. నెం. | ఖాతానెం. | రుణగ్రహీత పేరు & చిరునామా | బంగారు బరువు (గ్రాములలో) | బకాయి మొత్తం ఛార్జీలతో రూ. |
|---|---|---|---|---|
| 1 | 180270877277 | పి.కిరణ్‌కుమార్, తండ్రి పి.వేణుగోపాల్, | 12.40 | 60,837.24 |
| 2 | 180273052642 | 5-157, గాండ్ల వీధి, సూళ్లూరుపేట, నెల్లూరు జిల్లా | 31.50 | 1,62,815.80 |
| 3 | 180273052683 | - 524121 | 10.80 | 47,667.69 |

సూళ్ళూరుపేట, తేది:13.03.2026 సం॥ బ్రాంచ్ మేనేజర్, కెనరా బ్యాంకు

కెనరా బ్యాంక్ Canara Bank Together we can
తిరుపతి ఐఎస్‌మహల్ శాఖ(6163), తిరుపతి సెల్: 833390776, 9629977235

### బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలముగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు తెలియజేయడమేమనగా మీరు మా బ్యాంకు వద్ద బంగారు నగలు తాకట్టు పెట్టి పొందిన రుణమును తిరిగి చెల్లించలేదు. పలుమార్లు నోటీసులు పంపిననూ బట్వాడా కాకుండా తిరిగి వచ్చినది. **23.03.2026** వ తేది లోపు బకాయిలు,ఇతర ఛార్జీలను చెల్లించి తనఖా వుంచిన సెక్యూరిటీలను తిరిగి పొందగలరు. లేనియెడల బ్యాంకు శాఖ ఆవరణంలో **తేది:24.03.2026 సా.4.00గం॥లకు** లేదా బ్యాంకు నిర్ణయించిన ఏదేని తేదీలలో వేలం వేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు.

| వ. నెం. | ఖాతానెం. | రుణగ్రహీత పేరు & చిరునామా | బంగారు బరువు (గ్రాములలో) | బకాయి మొత్తం ఛార్జీలతో రూ. |
|---|---|---|---|---|
| 1 | 180312802241 | సి.నరేష్ తండ్రి సి.రామమూర్తి, ఇ.నెం.11-149, ముత్తునగర్, తిరుచానూరు, తిరుపతి జిల్లా -517503 | 44.00 | 2,30,221.28 |
| 2 | 180319493303 | అమాన సాయి, కేరాఫ్ ఎ.వాసు, 20-49-ఎస్26-3532, కొర్లగుంట, తిరుపతి- 517501 | 13.20 | 67,148.21 |
| 3 | 180319925690 | అమాస సాయి, కేరాఫ్ ఎ.వాసు, 20-49-ఎస్26-3532, కొర్లగుంట, తిరుపతి- 517501 | 28.00 | 1,17,319.69 |
| 4 | 180320600090 | ఎస్.బాను, భర్త ఎస్.నదీమ్ బాషా, 19-8-18-1 దాసరి మఠం, తిరుపతి- 517501 | 6.90 | 34,819.00 |
| 5 | 180329545387 | సి.నరేష్ తండ్రి సి.రామమూర్తి, ఇ.నెం.11-149, ముత్తునగర్, తిరుచానూరు, తిరుపతి జిల్లా -517503 | 11.00 | 49,887.00 |

తిరుపతి, తేది:13.03.2026 సం॥ బ్రాంచ్ మేనేజర్, కెనరా బ్యాంకు

## రైతులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

నాగలాపురం, మార్చి 13 ప్రభాతవార్త:



నాగలాపురం మండలంలో శుక్రవారం సాయంత్ర పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవకు విచ్చేసిన ఎమ్మెల్యే ఆదిమూలంకు ఘన స్వాగతం పలికి గజమాలతో రైతులు స్వాగతం పలికారు. అనంతరం రైతుల ఖాతాలో 6 వేలు చెక్కులను శుక్రవారం సత్యవేడు ఎమ్మెల్యే చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. నాగలాపురం మండలంలోని 3,875 రైతులకుగాను రూ.2 కోట్ల 19 లక్షలు చెక్కును రైతులకు అందజేశారు. అదే విధంగా సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాలకు గాను 29,653 మంది రైతులకు రూ.17.2182 కోట్లు రైతు ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంటలను అగ్రికల్చర్ ఆఫీసర్ వారి టీం తరపున కాయకూరలను ప్రదర్శనగా ఉంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు క్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రైతుల వ్యవసాయాన్ని సులభతరం చేసే దాని కోసం రైతులకు ఆదనాథంగా తయారు చేయబడిన డ్రోన్లు కాని వ్యవసాయానికి కావాల్సిన పనిముట్లను సబ్సిడీ కింద కూటమి ప్రభుత్వం రైతన్నలకు వ్యవసాయాన్ని సులభతరం చేయుటకు రైతులకు సబ్సిడీలు పనిముట్లు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఎరువుల సరఫరా విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండాసకాలంలో రైతులకు అందించే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నాం, వ్యవసాయంపైన మీకున్న ఎలాంటి సమస్యలు పైన అయినా వ్యవసాయ కార్య నిర్వహణ అధికారికి వెంటనే తెలియజేసి మీ సమస్యలను వెంటనే పరిష్కరించుకోవచ్చని ఎమ్మెల్యే రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ హనుమాన్ నాయక్, ఎంపీడీవో చంద్రశేఖర్‌రాజు, ఏవో, మాజీ ఎంపీపీ మురళి, ఎస్ఎం సురేష్, బాబా, పళణి, రమేష్, బాబు, మహేష్, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## భూ అక్రమణలను తొలగించిన రెవిన్యూ

కార్వేటినగరం,మార్చి 13 ప్రభాతవార్త:



కబ్జాకు గురైన భూములను సర్వే చేసి గ్రామస్థుల సమక్షంలో ఆక్రమణలను తొలగించిన సంఘటన పొన్నగల్లు గ్రామంలో చోటు చేసుకుంది. 10 మంది రైతులు సుమారు ఎకరా కాలువ పొరంబోకును గత కొంత కాలంగా ఆక్రమించుకొని అనుభవిస్తూ వచ్చారు. అయితే గ్రామస్థుల ఫిర్యాదుల మేరకు స్పందించిన కార్వేటి నగరం తాహశీల్దార్ కె.నాగరాజు, యస్.ఐ. తేజస్విని శుక్రవారం కబ్జాను తొలగించడం జరిగింది. కార్వేటినగరం మండలం పొన్నగల్లు గ్రామలెక్కదాఖలాలో సర్వే నెం,163లో కాలువ పొరంబోకు భూములున్నట్లు గుర్తించారు.సర్వే చేసి ఎ 0.091సెంట్ల భూమి ఆక్రమణలను తొలగించారు. ఆక్రమణలను తొలగించడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ఆర్ఐ నరసింహులు,హెడ్‌కానిస్టేబుల్‌యువరాజు,విఆర్ఓభరత్‌సాయి.సర్వేయర్‌మురళి,గ్రామస్థులు పాల్గొన్నారు.

## తారు రోడ్డు పనులను పరిశీలించిన ఎంపీపీ

**విజయపురం, మార్చి 13 ప్రభాతవార్త:** మండలంలోని చెంగమనాయుడు కండ్రిగ నుంచి చురికాపురం



రోడ్డు వరకు నూతనంగా పూర్తి చేసిన బీటీ రోడ్డును పంచాయతీరాజ్ డీఈ సుబ్బారాయుడుతో, ఏఈ వీరభద్రయ్యతో కలసి మండల పరిషత్ అధ్యక్షుడు డి.లక్ష్మిపతి రాజు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చినబాబు కృషితో తారు రోడ్డు పనులు తొందరగా పూర్తి అవుతున్నాయని, చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. రోడ్డు పనులను సకాలంలోపూర్తి చేయడంలో సహాయ సహకారాలు అందించిన వారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు రమేష్‌రాజు, టీడీపీ నాయకుడు గాలి మురళీనాయుడు, తదితర పార్టీనాయకులు పాల్గొన్నారు.

## శ్రీ ద్రౌపదీదేవి అమ్మవారి విగ్రహావిష్కరణ, కుంభాభిషేకం

పుత్తూరు రూరల్, మార్చి 13 ప్రభాతవార్త:

దక్షిణ భారతదేవంలోనే మహారథం కలిగిన శ్రీ ద్రౌపదీదేవి అమ్మవారి ఏకైక ఆలయం, సుమారు 200 ఏళ్ళ ఘన చరిత్ర కలిగిన పుత్తూరు ద్రౌపదీదేవి సమేత ధర్మరాజు స్వామి దేవస్థానంలో మరో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కానుంది. ఆలయ చరిత్రలో మణిమ కుటుంగా నిలిచే 40 అడుగుల భారీ శ్రీ ద్రౌపదీదేవి అమ్మవారి విగ్రహ విష్కరణ, మహ కుంభాభిషేకం మహోత్సవానికి భక్తులందరు పాల్గొనాలని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి 40 అడుగుల శ్రీ ద్రౌపదీదేవి విగ్రహ ఆవిష్కరణ, కుంభాభిషేకం అన్నప్రసాదం , మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. కావున ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని కోరుతున్నారు.

## ఔషధ రంగంలో సాంకేతికత అవసరం

రామచంద్రాపురం, మార్చి 13 ప్రభాతవార్త:



ఔషధ రంగంలో సాంకేతికత ఎంతో అవసరమని జార్ఖండ్‌లోని ఉషా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరామ్ నాగరాజన్ అన్నారు. శుక్రవారం వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మశీ కళాశాలలో ఏఐ 3డి ప్రింటింగ్ నూతన ఆవిష్కరణలపై జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, ఔషధ పరిశోధనలపై ఆధునిక విధానాల గురించి విద్యార్థులకు వివరించారు. ఐక్యూఏసి, ఐఐసి, ఆర్‌డిసెల్ ఉమ్మడిగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ కళాశాలల నుండి వచ్చిన విద్యార్థులు తమ పరిశోధనలపై మౌఖిక, ఈపోస్టర్‌ప్రదర్శనలుఇచ్చారు.ఈ కార్యక్రమంలోసెవెన్‌హిల్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్ బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులకు వరం అన్నదాత సుఖీభవ పథకం

- ఎంపీపీ తనుజా రెడ్డి



**వెంకటగిరి, మార్చి 13 ప్రభాతవార్త :** అన్నదాత సుఖీభవ పథకంరైతులకు వరం లాంటిది అని ఎంపీపీ తంబిరెడ్డి తనుజ రెడ్డి తెలిపారు. అన్నదాత సుఖీభవ నిధుల చెక్కును మండల పరిషత్ కార్యాలయంలో రైతులకు అందజేశారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు సమావేశాన్ని వీక్షించారు. కేంద్రం, రాష్ట్రం రెండు ప్రభుత్వాలు రైతులకు నిధులను ఖాతాలకు జమ చేసినట్లు చెప్పారు. రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. మాజీ ఏఎంసీ చైర్మన్ పులికల్లు రాజేశ్వరరావు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్తరించిందన్నారు. రైతులకు కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులను ఇస్తున్నట్లు చెప్పారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నదాత సుఖీభవ నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ అయ్యేటట్లు చేశారని చెప్పారు. రైతులకు వ్యవసాయ పనిముట్లను కూడా గత ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. జంబో చెక్కులను రైతులకు ఇచ్చారు.ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, మాజీ ఏఎంసీ చైర్మన్ సీసీ నాయుడు, ఏ డి ఏ అనసూయ, ఏవో సుజాత, మండల టిడిపి అధ్యక్షులు చంద్రమౌళి రెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులువెంకటాచలం,నాయకులురాయి మస్తాన్ నాయుడు, అవ్వరు సత్యనారా యణ పాల్గొ న్నారు.

## తిరుపతి క్యాడెట్ ఆన్యకు జాతీయ స్థాయి గుర్తింపు

తిరుపతి విద్య మార్చి 13 ప్రభాతవార్త:



తిరుచానూరులోని ఎడిపై స్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ ఆన్య ఉపాధ్యాయ్ ప్రతిష్టాత్మక డైరెక్టర్ జనరల్ (డీజి) ఎన్‌సీసీ కమెండేషన్ కార్డును అందుకున్నారు. ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే క్యాంప్-2026లో ఆంధ్రప్రదేశ్-తెలంగాణ డైరెక్టరేట్ తరపున పాల్గొని ప్రతిభ కనబరిచినందుకు గాను ఈ గుర్తింపు లభించింది. తిరుపతి గ్రూప్ హెడ్ క్వార్టర్స్‌లో గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దహియా చేతుల మీదుగా ఆమెకు ఈ ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో 29 (ఏ) బెటాలియన్ అధికారులు, పాఠశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు సెలవు లేదు.. పాఠశాలలు నిర్వహించాలి

తిరుపతి విద్య, మార్చి 13 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లాలో నేడు రెండో శనివారం అయిన మార్చి14ను పని దినంగా ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.ఎన్.కుమార్ తెలిపారు. గత అక్టోబర్ 28న భారీ వర్షాల కారణంగా ఇచ్చిన సెలవుకు బదులుగా ఈ నిర్ణయం తీసుకున్నారు.అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు రేపు తప్పనిసరిగా తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక బోధన నిర్వహించాలని, ప్రాథమిక స్థాయిలో ప్లన్ కార్యక్రమాలు అమలు చేయాలని సూచించారు. 1వ నుంచి 9వ తరగతుల వరకు నో బాగ్ డే పాటించాలని తెలిపారు. ఆదేశాలు అమలు చేయకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ హెచ్చరించింది.

## భాష్యం స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

తిరుపతి విద్య, మార్చి 13 ప్రభాతవార్త:



తిరుపతిలోని కెటి రోడ్ బ్రాంచ్‌లో ఉన్న భాష్యం స్కూల్‌లో ప్రీ-ప్రైమరీ , ప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ విద్యావేత్త సీతా కుమారి పాల్గొని విద్యార్థులకు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతో చదువులో ముందుకు సాగాలని ప్రేరణాత్మక సందేశం అందించారు.స్కూల్ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ మాట్లాడుతూ, చిన్నారులు తమ విద్యా ప్రయాణంలో ఒక ముఖ్యమైన దశను పూర్తి చేసినందుకు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రాడ్యుయేషన్ క్యాప్, గౌన్ ధరించి సర్టిఫికేట్లు స్వీకరించారు. క్లాసికల్ డాన్స్ సహా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో చిన్నారులు ఆకట్టుకున్నారు.

## సిఎన్‌జి, పిఎన్‌జి సరఫరా యథావిధిగా

తిరుపతి విద్య, మార్చి 13 ప్రభాతవార్త:

తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో సిఎన్ జి, పిఎన్‌జి గ్యాస్ సరఫరా ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగు తోందని థింక్ గ్యాస్ సంస్థ తెలిపింది. ప్రస్తుతానికి ధరల్లో కూడా ఎలాంటి మార్పులు లేవని పేర్కొంది.ప్రపంచ ఇంధన పరిస్థితుల నేపథ్యంలో వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సంస్థ వెల్లడించింది. ప్రస్తుతం పిఎన్‌జి ధర ఒక ఎస్‌సిఎంకు రూ 47 కాగా, సిఎన్‌జి ధర ఒక ఎస్‌సిఎం కు రూ 88గా కొనసాగుతోంది.

## విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌శిక్షణ

తిరుపతి విద్య, మార్చి 13 ప్రభాతవార్త:



తిరుపతిలోని టిటిడి శ్రీ గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్యూనికేషన్ స్కిల్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ వాలెడిక్టరీ కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సత్యనారాయణ మాట్లాడుతూ, పోటీ ప్రపంచంలో విద్యార్థులకు కమ్యూనికేషన్ నైపుణ్యాలు ఎంతో అవసరమని తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ పి. సృజన విద్యార్థులు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదనపు జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ పి. మురళీకృష్ణ మాట్లాడుతూ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా విద్యార్థులకు ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రైనర్ వి. భువనేశ్వరి, ఎ.శ్రీరామ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిఘా సంస్థల పాత్ర కీలకం

తిరుపతి విద్య, మార్చి 13 ప్రభాతవార్త:




శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్రం, ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో చట్టబద్ధ నిఘా రాజకీయ పరిణామాలు ఒక విమర్శాత్మక దృక్పథం అంశంపై జాతీయ సదస్సు శుక్రవారం సెనేట్ హాల్లో జరిగింది.సదస్సును విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య టాటా నరసింగ రావు ప్రారంభిస్తూ, ప్రపంచవ్యాప్తంగా శాంతి భద్రతలు, సామాజిక నియంత్రణ కోసం నిఘా సంస్థల ప్రాధాన్యం పెరుగుతోందని తెలిపారు. సదస్సుకు అధ్యక్షత వహించిన రాజనీతి శాస్త్ర విభాగాధిపతి ఆచార్య బి.వి.మురళీధర్ మాట్లాడుతూ, నిఘా చర్యలు జాతీయ భద్రత, ప్రజా శాంతి పరిరక్షణకు అవసరమని పేర్కొన్నారు. కీలకోపన్యాసం చేసిన ఝార్ఖండ్ రాష్ట్ర పోలీస్ ఇన్స్పెక్టర్ జనరల్ క్రాంతి కుమార్ గడిదేసి మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు పోలీసింగ్‌లో కీలక పాత్ర పోషిస్తున్నదని, భద్రత మరియు వ్యక్తిగత స్వేచ్ఛ మధ్య సమతుల్యత అవసరమని తెలిపారు.ఈ సదస్సులో డా. ఏ. సాంబమూర్తి, డా. ఐ.ఎస్. కిషోర్, పి. సాయికుమారి, డా. సి.ఎల్. చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పది విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

తిరుపతి రవాణ, మార్చి 13 ప్రభాతవార్త:

10వ తరగతి పబ్లిక్ పరీక్షలు-2026కు హాజరయ్యే విద్యార్థుల సౌకర్యార్థం ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. మార్చి 16 నుండి ఏప్రిల్ 1 వరకు పరీక్షల రోజుల్లో విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని వెల్లడించారు.ఈ సదుపాయం పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ బస్సుల్లో వర్తిస్తుందని తెలిపారు. పరీక్షల తేదీలలో విద్యార్థులు తమ హాల్ టికెట్ చూపించి పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు ఈ ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నారు.పరీక్షల రోజుల్లో విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ప్రత్యేకంగా ఈ సౌకర్యం కల్పించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

## పిల్లలను సోషల్ మీడియాక బందీలను చేయ్యవద్దు : ఎస్ఐ

సత్యవేడు, మార్చి 13 ప్రభాతవార్త:




చిన్న పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇచ్చి సోషల్ మీడియాకు ఆడిట్ చేయవద్దని సత్యవేడు సబ్ ఇన్స్పెక్టర్ సాయినాథ్ చౌదరి కోరారు. స్థానిక శ్రీ విద్య కాన్సెప్ట్ హైస్కూలు ప్రాంగణంలో కరస్పాండెంట్ నాగయ్య అధ్యక్షతన ప్రిన్సిపాల్ రాధా పర్యవేక్షణలో రెండు రోజుల కిండర్ గ్రాడ్యుయేషన్ సంబరాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు వారి పిల్లలకు మొబైల్ ఫోన్‌ఇస్తే అసలు లక్ష్యం దెబ్బతింటుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ఐటీ ఉన్నత విద్యాశాఖ మంత్రి లోకేష్ 12సంవత్సరాల లోపు పిల్లలు సోషల్ మీడియా జోలికి వెళ్ళకుండా నిషేధం విధించడానికి కసరత్తు ప్రారంభమైందన్నారు. పిల్లలు తల్లిదండ్రులు కూడా ఈ విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. పైగా పిల్లలు ఎదుట ఉండగా తల్లిదండ్రులు కూడా మొబైల్ ఫోన్లు చూడడం సబబు కాదన్నారు. విద్యలో పిల్లల లక్ష్యాలను సాధించడానికి వారి తల్లిదండ్రులు కూడా సహకరించాలన్నారు. ప్రస్తుతం విద్యార్థులు కొందరు ఆన్‌లైన్‌లో ఆటల్లో మునిగిపోయి వేలాది రూపాయలు నష్టపోవడంతో పాటు వారి తల్లిదండ్రులను కూడాఆందోళనకు గురి చేస్తున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. పైగా పిల్లల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు కన్నేసి ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే బాల్య వివాహాలను ఎట్టి పరిస్థితుల్లోను తల్లిదండ్రులు ప్రోత్సహించరాదన్నారు. అనంతరం 124 మంది పిల్లలకు కిండర్ గ్రాడ్యుయేషన్ పట్టాలను ఎస్ఐ, కళాశాల కరస్పాండెంట్‌తో కలసి ప్రదానం చేశ్యారు. అంతకు ముందు ఎస్ఐ శాలువ కప్పి కరస్పాండెంట్ సన్మానించారు. సంబరాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ విద్యా హైస్కూలు ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వివరాలను డిజిటలిజేషన్ నమోదు

సత్యవేడు, మార్చి 13 ప్రభాతవార్త:



శ్రీసిటీ పరిధిలో నడుస్తున్న వివిధ కంపెనీల్లో మ్యాన్ పవర్ ఏజెన్సీ ద్వారా పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగుల వివరాలను డిజిటలిజేషన్ ద్వారా అందుబాటులో ఉంచుకోవాలని శ్రీసిటీ డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. ఆపరేషన్ వజ్రప్రహర్‌లో భాగంగా తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం శ్రీసిటీ ట్రేడ్ సెంటర్‌లో వివిధ కంపెనీలకు మ్యాన్ పవర్ సప్లయ్ చేస్తున్నటువంటి ఏజెన్సీ కాంట్రాక్టు దారులతో రోడ్డు భద్రత, మహిళలపై నేరాలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ డీఎస్పీ మాట్లాడుతూ మ్యాన్ పవర్ ఏజెన్సీ ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి కంపెనీలో పని చేస్తున్న కార్మికుల వివరాలను తప్పని సరిగా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అలాగే కార్మికుల ఉన్న ప్రదేశాలను కూడా రోజువారిగా తనిఖీ చేయాల్సిన బాధ్యత ఏజెన్సీ కాంట్రాక్టు దారులపై ఉందన్నారు. దీంతో పాటు కంపెనీల్లో పని చేస్తున్న కార్మికులు ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. దీనిపై కాంట్రాక్టు ఏజెన్సీ దారులు కూడా నిఘా ఉంచాలన్నారు. ఇప్పటికే గంజాయి తరలింపు, వాడకాలపై పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు. శ్రీసిటీ పరిధిలో ఎక్కడైనా గంజాయి అక్రమంగా తీసుకుపోతున్నా వెంటనే సమాచారాన్ని పోలీసులకు అందించాలని ఆయన కోరారు. దీనిపై మ్యాన్ పవర్ ఏజెన్సీ కాంట్రాక్టు దారులు కూడా కార్మికులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో శ్రీసిటీ ఎస్ఐలు ప్రియాంక, సుధీర్‌కుమార్‌రెడ్డి, శ్రీసిటీ సెక్యూరిటీ మేనేజర్ రమేష్, మ్యాన్ పవర్ ఏజెన్సీ కాంట్రాక్టు దారులు పలువురు పాల్గొన్నారు.

## శ్రీరామ కాలేజ్‌లో మహిళా దినోత్సవ వేడుకలు

తిరుపతి విద్య మార్చి 13 ప్రభాతవార్త:




కరకంబాడి రోడ్‌లోని శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముగింపు సదస్సు ఘనంగా నిర్వహించారు. ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్, ఐఈఈఈ ఉమెన్ ఇన్ ఇంజనీరింగ్,ఐ ఖ్యు ఎ సి సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులు, మహిళా సిబ్బందికి క్రీడా, టెక్నికల్ ,వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు చేపట్టారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడ్వకేట్ డా. ఆకుల వనజ (చిత్తూరు) హాజరై సెక్సువల్ హరాస్మెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, మహిళలు ప్రతి రంగంలో ముందంజలో ఉన్నారని, కళాశాల విద్యార్థినులు కూడా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు.కార్యక్రమంలో చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ డా. కె. జయచంద్ర, వైస్ ప్రిన్సిపాల్ డా. ఎన్. వాసు, ప్రోగ్రాం కన్వీనర్లు డా. స్వప్నసుధ, డా. లలిత, శ్రీమతి చంద్రకళ పాల్గొన్నారు.

## స్పాట్ వాల్యుయేషన్ కోడింగ్ సిస్టమ్‌పై శిక్షణ

తిరుపతి విద్య, మార్చి 13 ప్రభాతవార్త:




ఎస్ఎస్‌సి, ఎపిఓ ఎస్ఎస్ పబ్లిక్ పరీక్షలు-2026ను దృష్టిలో ఉంచుకుని స్పాట్ వాల్యుయేషన్ కోడింగ్ సిస్టమ్‌పై జోన్-1 ప్రాంతీయ స్థాయి ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎనిమిది జిల్లాలకు చెందిన కోడింగ్ సిబ్బంది ఈ సమావేశంలో పాల్గొని మూల్యాంకన విధానాలు, కోడింగ్‌కు సంబంధించిన ముఖ్యాంశాలపై అవగాహన పొందారు.ఈ కార్యక్రమానికి కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్, తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.ఎన్.కుమార్,సత్యసాయి జిల్లా విద్యాశాఖాధికారి కృష్ణప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆర్జేడీ శామ్యూల్ మాట్లాడుతూ, ఎస్ఎస్‌సి మూల్యాంకన ప్రక్రియలో కోడింగ్ విధానం అత్యంత కీలకమని పేర్కొన్నారు. చిన్న పొరపాటు కూడా విద్యార్థుల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున కోడింగ్ సిబ్బంది అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. పరీక్షల పారదర్శకత, నిబంధనల పాటింపు, ఫలితాల ఖచ్చితత్వం కోసం కోడింగ్ సిస్టమ్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.ఎన్. కుమార్ మాట్లాడుతూ, స్పాట్ వాల్యుయేషన్‌లో కోడింగ్ విధానాల సక్రమ అమలు విద్యార్థుల నిజమైన ప్రతిభ ప్రతిఫలించేందుకు ఎంతో అవసరమని అన్నారు. అన్ని కోడింగ్ సిబ్బంది నిర్దేశిత మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సూచించారు.కార్యక్రమంలో తిరుపతి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ (పబ్లిక్ ఎగ్జామ్స్) సుధ, వివిధ జిల్లాల డీవైఈఓలు, అధికారులు పాల్గొన్నారు. కోర్సుకు సంబంధించిన అంశాలను సురేష్, వేణుగోపాల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి రిసోర్స్ పర్సన్‌లుగా వ్యవహరించారు.

## మహిళలకు వరం హెచ్ పి వి వ్యాక్సినేషన్ .

చిట్వేలి, మార్చి 13, ప్రభాతవార్త:



స్త్రీలలో గర్భాశయ క్యాన్సర్ నిరోధానికి ప్రభుత్వం అందిస్తున్న హెచ్పీవీ వాక్సినేషన్ మహిళలకు గొప్ప వరం లాంటిదని వైద్యులు శివప్రసాద్ గౌడ్ మరియు సల్మాలు అన్నారు. శుక్రవారం 14 సంవత్సరాల బాలికలకు వారి తల్లిదండ్రుల సమక్షంలో ఈ వ్యాక్సినేషన్ విజయవంతంగా వేశారు. వైద్యులు మాట్లాడుతూ 10 వేల నుంచి 20 వేల వరకు ఖర్చుతో కూడుకున్న ఈ వ్యాక్సిన్ ప్రభుత్వం ఉచితంగా అందించడం గొప్ప విషయం అన్నారు. 12 మంది బాలికలకు మొదటిరోజు వాక్సినేషన్ ఇచ్చినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ లు రజని, తెజోవతి, ఎంపి హెచ్ఈఓ విజయకుమార్, ధనలక్ష్మి, పి హెచ్ఎన్ విజయకుమారి, హెల్తసూపెర్వాజర్ ఇస్మాయిల్ బాషా, ఫార్మసిస్ట్ సుమలత, ఏం ఎల్ పి హెచ్ కల్పన, సాయి లీలా, రుఖియాబాను, ఏఎన్ఎం కృష్ణవేణి,గౌరి, ఆశలు బాలికల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## ఎస్వి వైద్య కళాశాలలో...మొల్ల జన్మదిన వేడుకలు



తిరుపతి హెల్త్, మార్చి 13 ప్రభాతవార్త: కవయిత్రి మొల్ల జన్మదిన వేడుకలు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎస్వీ వైద్య కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డిఎస్ఎన్ మూర్తి, చిత్రపటానికి పూల మాలవేసి, నివాళులు అర్పించారు. ఎస్ వి వైద్య కళాశాల వైద్యులు, వైద్య సిబ్బంది, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ శతాబ్దానికి చెందిన ప్రముఖ తెలుగు కవయిత్రి మొల్ల ఆమె సంస్కృతంలోని రామాయణాన్ని తెలుగులోకి అనువదించారు. మొల్ల రామాయణం అనే ఈ కావ్యం, తెలుగు సాహిత్యంలో ఒక మహాకావ్యంగా ప్రసిద్ధి చెందింది. మొల్ల ఆతుకూరి గోపవరం (కడప జిల్లా)లో జన్మించారు. ఆమె తండ్రి ఆతుకూరి కేసన్న, తల్లి నాంచమ్మ. మొల్ల కుమ్మరి కులానికి చెందినవారు. ఆమె తండ్రి శివభక్తుడు, శ్రీకంఠ మల్లేశ్వర స్వామి భక్తుడు. మొల్లకు శివుడు గురువు, ఆమెకు పొత్తన్న కవి నుండి ప్రేరణ లిచ్చారని చెబుతారు. రచనలుమొల్ల రామాయణం, మొల్ల రచించిన ప్రసిద్ధ కావ్యం. ఇది సంస్కృత రామాయణానికి తెలుగు అనువాదం. ఈ కావ్యం సరళమైన తెలుగు భాషలో రాయ బడింది. మొల్ల రామాయణం, తెలుగు సాహిత్యంలో ఒక మహాకావ్యంగా ప్రసిద్ధి చెందిందిఆయన తెలిపారు. ఆమె రచనలు, మొల్ల, తెలుగు సాహిత్యంలో ఒక మహిళా కవయిత్రిగా ప్రసి ద్ధి చెందారు. మొల్ల, 1530లో శ్రీశైలంలో మహాసమాధి పొందారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి .ఎస్.ఎన్ మూర్తి, ఎస్ వి వైద్య కళాశాల అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ ఉమాదేవి, ఆఫీస్ సూపరిటెండెంట్ రేణుక, ఆంధ్రప్రదేశ్ మెడికల్ సెక్రటరీ ఏటుకూరి గిరిబాబు, ముని కేశవులు, బాలరాజునాయుడు, మురళి, ఎస్వి వైద్య కళాశాల వైద్యులు, వైద్య సిబ్బంది, తదుతరులు పాల్గొన్నారు.

## ల్యాబ్ టెక్నీషియన్స్ సేవలు అమూల్యమైనవి

**పులిచెర్ల, మార్చి 13 ప్రభాతవార్త:** రోగుల ఆరోగ్య పరిస్థితిని సరిగ్గా అంచనా వేయడానికి ల్యాబ్ టెక్నీషియన్స్ అందించే నివేదికలు, వారి సేవలు అమూల్యమైనవని పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి ప్రశంసించారు. ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్ దినోత్సవం సందర్భంగా పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలందిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ జయప్రకాష్‌ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ ఆరోగ్య వ్యవస్థలో ల్యాబ్ టెక్నీషియన్లు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారన్నారు. రోగ నిర్ధారణకు అవసరమైన రక్తం, మూత్రం, కఫం మరియు ఇతర పరీక్షలను ఖచ్చితంగా నిర్వహించడం ద్వారా వారు వైద్యులకు సరైన నిర్ధారణ చేయడంలో కీలక సహకారం అందిస్తున్నారన్నారు. వివిధ అంటువ్యాధుల నియంత్రణ, గర్భిణీ స్త్రీల పరీక్షలు, మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధుల గుర్తింపులో కూడా ముఖ్యమైన సేవలు అందిస్తున్నారని, వారి కృషి వల్ల సమయానికి సరైన చికిత్స అందించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం సాధ్యమవుతుందని తెలియజేశారు. ప్రత్యేకంగా ప్రభుత్వ ఆరోగ్య సేవలలో ల్యాబ్ టెక్నీషియన్లు గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన పరీక్షా సేవలను అందిస్తూ ఆరోగ్య సేవల బలోపేతానికి తోడ్పడుతున్నారని, వారి అంకితభావం, కృషి, నైపుణ్యం ఆరోగ్య వ్యవస్థకు బలమైన ఆధారమని కొనియాడారు. ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్లందరికీ అభినందనలు తెలియజేస్తూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వారు ఇలాగే మరింత సేవలందించాలని అభిలాషించారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ నర్స్ శ్రీదేవి, ఆరోగ్య పర్యవేక్షకులు ప్రమీల, పురుషోత్తం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## 14 ఏళ్ల బాలికలకు హెచ్‌పివి టీకా కార్యక్రమం ప్రారంభం



***బాలాయపల్లి, మార్చి 13, ప్రభాతవార్త*** మండలంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 14 సంవత్సరాల వయస్సు గల బాలికల కోసం హెచ్‌పివి (హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకా కార్యక్రమం శుక్రవారం ప్రారంభించినట్టు వైద్యాధికారిణి జి.లిఖిత, వైద్యాధికారిణి టీ. లియోనా తెలిపారు. ఈ కార్యక్రమాన్ని బాలాయపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టిడిపి మండల అధ్యక్షులు రావి సత్యనారాయణ, టిడిపి మాజీ మండలాధ్యక్షులు రావి మస్తాన్ నాయుడు, సర్పంచ్ దట్టం అంజలి ప్రారంభించారు. హ్యూమన్ పాపిలోమా వైరస్ వల్ల కలిగే గర్భాశయ, గర్భద్వార క్యాన్సర్ నివారణ కోసం కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఈ టీకా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇవ్వబడుతున్న హెచ్‌పివి టీకా సురక్షితమైనదిగా, శాస్త్రీయంగా నిరూపితమైనదిగా వారు పేర్కొన్నారు. ఈ టీకా 14 సంవత్సరాల వయస్సు కలిగి ఉండి 15 సంవత్సరాలు పూర్తి కాని బాలికలకు (14వ పుట్టినరోజు జరుపుకొని 15వ పుట్టినరోజు జరుపుకోని బాలికలు) ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. అర్హత గల బాలికలకు ఒక్క డోస్ టీకా అందజేస్తారన్నారు. ఈ టీకాలు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సంబంధిత ఆరోగ్య కేంద్రాల్లో ఇవ్వబడతాయన్నారు. టీకా తీసుకోవడానికి వచ్చే బాలికలు తండ్రి లేదా సంరక్షకుడితో రావాలని, అలాగే వయస్సు నిర్ధారణ కోసం ఆధార్ కార్డు లేదా ఇతర చెల్లుబాటు అయ్యే పత్రం తీసుకురావాలని సూచించారు. టీకా వివరాలు యు - డబ్ల్యూఐఎన్ ఆన్‌లైన్ వ్యవస్థలో నమోదు చేయబడే కారణంగా ఓటిపి కోసం మొబైల్ ఫోన్ తీసుకురావాలని తెలిపారు. బాలికలు ఖాళీ కడుపుతో రాకూడదని వైద్య అధికారులు సూచించారు. టీకా కోసం ముందస్తుగా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి లేదా యు - డబ్ల్యూఐఎన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం కూడా ఉందన్నారు.

## మృతి చెందిన అంగన్వాడీ కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం



***వెంకటగిరి, మార్చి 13, ప్రభాతవార్త*** మృతి చెందిన అంగనవాడి కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని సిడిపిఓ శంషాద్ బేగం తెలిపారు. మండల పరిధిలోని పట్రపల్లి గ్రామ అంగన్వాడి కార్యకర్త చేమూరు పెంచలమ్మ (50) ఈ నెల మార్చి రెండో తేదీ చలో చలో విజయవాడ అంగన్వాడి నిరసన కార్యక్రమంకు వెళ్లడం జరిగింది. అక్కడ ఆమెకి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్ను మూశారు. ఆమె స్వగ్రామం పట్రపల్లి గ్రామ ఇంటి వద్దకు వెళ్లి సీడీపీఓ శంషద్ బేగం, అంగన్వాడి కార్యకర్తలు పెంచలమ్మ మృత దేహానికి నివాళులు అర్పించారు. అనంతరం పెంచలమ్మ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని దేవుని ప్రార్ధించినట్లు తెలిపారు.

## పశు సంరక్షణ పై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలి

**బాలాయపల్లి, మార్చి 13 ప్రభాతవార్త :** రైతులు పశు సంరక్షణ పై ప్రత్యేక దృష్టి సారించాలని ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథం తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం, అవగాహన సదస్సు బాలాయపల్లి మండలం పిగిలాం గ్రామ సచివాలయ ఆవరణలో జరిగింది. రైతులకు పశు సంరక్షణ కోసం ప్రభుత్వం సబ్సిడీతో దాన మందులు ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను కూడా అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ వారి సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు వెంకటగిరి ఉప సంచాలకులు పశువైద్యాధికారి డాక్టర్ శ్రీహరి తెలిపారు. ముందుగా గోమాతలను పూజించి రిబ్బన్ కట్ చేసి వెంకటగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథం ప్రారంభించారు. దోమలు, పిడుదులు సోకకుండా పశువులకు మందులు వేశారు. కొన్ని గేదెలకు వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించారు. ముందుగా పేడ, రక్త పరీక్షలు చేసుకొని, వ్యాధులు తెలుసుకొని దూరం చేసుకోవచ్చునని అన్నారు. ఈ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. బాలాయపల్లి పశువైద్యాధికారి కిషోర్ కుమార్ మాట్లాడుతూ రాయితీతో పశువుల గ్రాస విత్తనాలు ఇస్తున్నట్లు తెలిపారు. వరిగడ్డితో పాటుగా పిల్లి పెసర, చిరుధాన్యాలు, తవుడు, మొక్కజొన్న పిండి లాంటి బలవర్ధక ఆహారాన్ని పశువులకు అందించాలన్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారులు, వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ దృష్టికి తీసుకుని వెళ్లి అతనిపై చర్యలు తీసుకుంటామని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ విశ్వనాథం తెలిపారు. రైతులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో గూడూరు పశుసంవర్ధక శాఖ ఏ.డి. సురేష్, అశోక్, టిడిపి నేతలు శేషమనాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, పశు సిబ్బంది, వ్యవసాయ మార్కెట్ సిబ్బంది ఉన్నారు.

## గ్యాస్ గోడౌన్లను తనిఖీ చేసిన తహసీల్దార్

తొట్టంబేడు, మార్చి 13 ప్రభాతవార్త:



తొట్టంబేడు మండల పరిధిలోని భారతి గ్యాస్, హెచ్.పీ గ్యాస్, గోడౌన్లను, గ్యాస్ ఏజెన్సీలను తొట్టంబేడు తహసీల్దార్ భారతి శుక్రవారం తనిఖీ చేశారు. ఏజెన్సీ యజమానులతో మాట్లాడుతూ గోడౌన్లలో గ్యాస్ ఎంత ఉంది. ఎన్ని సిలిండర్ లు ఉన్నాయి. ఎంతమంది వినియోగదారులకు ఇచ్చారు అని వారి స్టాకు యొక్క వివరాలను అడిగి తెలుసుకున్నారు. తొట్టంబేడు మండల పరిధిలో మూడు గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. మండల ప్రజలకు ఎక్కడ గ్యాస్ కొరత లేదు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సుజాత, విఆర్ఓ దినేష్, తలారి అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఏకాగ్రతతో చదివితే లక్ష్యం చేరుకోవచ్చు

తొట్టంబేడు, మార్చి 13 ప్రభాతవార్త:



ఏకాగ్రతతో చదివితే ఉన్నత శిఖరాలను అందుకోవచ్చని లింగం నాయుడుపల్లికి చెందిన గంధం.చంద్రశేఖర్ అన్నారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు కష్టపడి చదివి, ఉన్నత ఫలితాలతో పాఠశాలకు, తాము పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకురావాలన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బోనుపల్లి, లింగమనాయుడుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల ఉచితంగా పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, యువసేన సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఊరందూరు పొలాల్లో...రైతులతో ఎంఎల్ఏ

శ్రీకాళహస్తిరూరల్,మార్చి 13 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు గ్రామ పొలిమేరల్లోని పంట పొలాల్లో శుక్రవారం శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అధికారులు, నాయకులతో కలసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పంట పొలాల్లో పని చేసుకుంటున్న దళిత రైతు యాగయ్యను కలసి ప్రభుత్వ పథకాలు ఎలా ఉన్నాయని? ప్రభుత్వం ఇస్తున్నది కాకుండా మరేం కోరుకుంటున్నారని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ప్రశ్నించారు. ఆయన ఎంతో సంతృప్తిగా మొదటి విడత అన్నదాత సుఖీభవ సొమ్ములతో మొదటి కారు పంటలను పండించుకున్నామని ఎరువులుకొనుగోలు చేసామన్నారు. రెండవ విడతలో వేసిన నిధులతో పంట కోతకు వినియోగిస్తున్నట్లు వివరించారు. ఎరువులు, విత్తనాలు సక్రమంగా అందుతున్నాయా? అని ప్రశ్నించారు. అయితే యాగయ్య అనే రైతు కూటమి ప్రభుత్వం అన్ని చేస్తుందని అయితే గిట్టుబాటు ధర రూ.2500 కల్పిస్తే రైతులకు ఎంతో మేలు చేసిన వారౌతారని వివరించారు. నేడు వ్యవసాయ ఖర్చులు బాగా పెరిగాయన్నారు.ఎంఎల్ఏతో పాటు వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి, శ్రీకాళహస్తివ్యవసాయమార్కెట్ కమిటి అధ్యక్షుడు రంగినేని చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఉచిత సహాయక పరికరాలకు నమోదు

ఏర్పేడు,మార్చి 13 ప్రభాతవార్త:




ఏర్పేడు మండలంలో శుక్రవారం దివ్యాంగులు,వయోవృద్ధులకు తెలుగుదేశం పార్టీ నాయకులు ఉచిత సహాయక పరికరాలను అందించుటకు నమోదు కార్యక్రమాలను నిర్వహించారు.మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రెడ్డివారి గురువారెడ్డి, ముఖ్యఅతిథులుగా హాజరు కాగా మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు అధ్యక్షతన కార్యక్రమాలు ఏర్పాటు చేసారు.ఈ మేరకు భారీ సంఖ్యలో దివ్యాంగులు హాజరై నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో పున్నారావు, మహేష్‌రెడ్డి, గాలి కృష్ణవేణి, పూల హేమచ్చి రాఘవేంద్ర, బాబునాయుడు, సుబ్రమణ్యం రెడ్డి, మనోహర్‌నాయుడు, ఏర్పేడు మండల అధికారి సౌభాగ్యమ్మ, జిపి రాజశేఖర్‌నాయుడు తదితరులుపాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు

శ్రీకాళహస్తి రూరల్,మార్చి 13 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవం ను ఘనంగా నిర్వహించారు.పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభను ఏర్పాటు చేసారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిరంజీవి మట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తీర్ణతలో అధిక శాతం సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల ఉపాధ్యాయులు డాక్టర్ సుబ్రమణ్యం శర్మ, నరసింహులు, నాగరాజు, నిర్మల కుమారి, చంద్ర చంద్రశేఖర్, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

## వికలాంగుల ఉపకరణాలకు నమోదు చేసుకోండి.

చిట్వేలి, మార్చి 13, ప్రభాతవార్త:

స్థానిక మండల పరిధిలోని వికలాంగులు తమకు కావలసిన ఉపకరణాల పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసులు సూచించారు.శుక్రవారం తాను మాట్లాడుతూ ఉన్నత పాఠశాల వేదికగా మార్చి 14 శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. వృద్ధులు పిల్లలు మహిళలు వికలాంగులు ఎవ్వరైనా సరే అర్హులన్నారు.సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డ్,రేషన్ కార్డు, 2 ఫొటోస్, యు డి ఐ డి కార్డు రెండు సెట్ల జిరాక్స్ తీసుకురావాలని ఎంపీడీవో తెలిపారు.

## ల్యాబ్ టెక్నీషియన్ డే...వృద్ధులకు వైద్యపరీక్షలు

శ్రీకాళహస్తి,మార్చి 13 ప్రభాతవార్త:




శ్రీకాళహస్తిలో శుక్రవారం ల్యాబ్ టెక్నిషియన్ డేను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శుక్రవారం శ్రీకాళహస్తి ల్యాబ్‌టెక్నిషియన్ యూనియన్ సారథ్యంలో పేదలకు అన్నదానంతో పాటు వారి ఆరోగ్యపరిరక్షణకు సంబందించి వైద్యపరీక్షలు నిర్వహించారు. పట్టణంలోని ల్యాబ్ టేక్నిషియన్లు శుక్రవారం సమావేశం అయి సంబరాలు జరుపుకున్నారు. ఈ నేపథ్యంలో బంగారమ్మ కాలనీకి సమీపంలోని వృద్ధాశ్రమంలో అక్కడ నిరాదరణకు గురై ఉంటున్న వారికి భోజనం ఎపెట్టారు. అలాగే ప్యూరిఫై వాటర్‌ను అందించుటకుస దుపాయాలు కల్పించారు. అలాగే వృద్ధా శ్రమంలో ఉంటున్న వారికి వైద్యపరీక్షలు నిర్వహించి బిపి షుగర్ ఉన్న వారికి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమాల్లో హబీబ్,వేణు,షకీల్, హరిష్ తదితరులు పాల్గొన్నారు.

## మసీదు యూత్‌చే 'ఇఫ్తార్ విందు'

శ్రీకాళహస్తి,మార్చి 13 ప్రభాతవార్త:




పెద్ద మసీదుకు చెందిన యూత్‌చే శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ఉపవాసదీక్షలు పాటించే వారికి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసారు. శుక్రవారం ఈ ప్రాంతానికి చెందిన యువకులు కలసి ఇఫ్తార్‌విందును ఏర్పాటు చేసారు. భక్తి శ్రద్ధలతో నమాజులను ఆచరించి ఉపవాసదీక్షలు పాటించిన వారికి ఆష్‌తో పాటు బిరియాని అందించారు. ఈ నేపథ్యంలో మసీదువీధిలోని యువకులు,మైనారిటి యువ నాయకుడు గోరా సారథ్యంలో ఇఫ్తార్ విందు అందించారు. ఈ కార్యక్రమాల్లో గోరా, శ్రీకాళహస్తి ఖాజీ మున్నాభాయ్,యువకులు తమీమ్, సాజిద్, షబీరుల్లా, సర్థార్, మిర్జాంవలి, నూరు, అమాన్, చోటా, సారు, సులేమాన్, ఉస్మాన్, అల్తాఫ్, మహమ్మద్ ఖాజీ సాహెబ్‌మున్నాభాయ్, ఉమర్,మాజీ కౌన్సిలర్ మహబూబ్‌బాషా,గఫూర్ తదితరులు సహాకరించారు.

## 15న పెన్షనర్స్‌డే

శ్రీకాళహస్తి,మార్చి 13 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం శ్రీకాళహస్తి నియోజకవర్గ యూనిట్ సారథ్యంలో ఈనెల 15న పెన్షనర్ డేను నిర్వహించనున్నట్లు అ ధ్యక్షులు బూడిదవాకం వెంకయ్య, ప్రధాన కార్యదర్శి పివి ప్రసాద్ గౌరవాధ్యక్షులు ఏ.పురుషోత్తం గౌడ్ కోశాధికారి యు.వెంకట రమణయ్యలు శుక్రవారం మీడియా సమావేశంలో తెలిపారు.ఈ నెల 15న ప్రభుత్వాసుపత్రికి సమీపంలోని పెన్షనర్స్ భవనంలో ఉదయం కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.ఈ సమావేశానికి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరౌతారని వారు వివరించారు.ఈ సందర్భంగా 32 మంది రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించనున్నట్లు వివరించారు.

## గురుమిత్ర ఫౌండేషన్‌చే విద్యా సామాగ్రి పంపిణీ

తొట్టంబేడు, మార్చి 13 ప్రభాతవార్త:



సమాజంలో చదువు ఒక్కటే పేదరికాన్ని రూపుమాపుతుందని, అందుకోసం నిరంతరం కృషి చేయాల్సి ఉంటుందని, క్రమశిక్షణతో చదివి ఉన్నతమైన విలువలతో ఎదిగి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరును, గుర్తింపును విద్యార్థులు తీసుకురావాలని గురుమిత్ర ఫౌండేషన్ వ్యవస్థాపకులు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు బి. చెంచయ్య శుక్రవారం అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుండెలిగుంట తొట్టంబేడు మండలంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు రాయడానికి అవసరమైన సామాగ్రిని తొమ్మిదవ తరగతి విద్యార్థులకు బ్రిడ్జ్ కోర్సులో భాగంగా స్టడీ మెటీరియల్ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ముని, తిరుమలయ్య, ఉపాధ్యాయులు మూర్తి, రమాదేవి, భాస్కరయ్య మునీశ్వర్ రెడ్డి , శ్రీకర్ రెడ్డి, ఢిల్లీ బాబు పాల్గొన్నారు.

## దళిత ఉపాధ్యాయురాలిపై వివక్ష తగదు!

తొట్టంబేడు మార్చి 13 ప్రభాతవార్త:



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్ద కన్నలి నందు తెలుగు భాషా ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న ఇ.మహాలక్ష్మి పై తోటి అగ్రవర్ణ ఉపాధ్యాయులు చూపిస్తున్న కుల వివక్ష సహించేది లేదని కులవివక్ష పోరాట సమితి నాయకులు హెచ్చరించారు.పోరాట సమితి శుక్రవారం పాఠశాలలో పర్యటించారు. ఇటీవల పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల మధ్య వైరం గురించి విద్యార్థిని, విద్యార్థులు , ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులతో విడివిడిగా కలిసి సుదీర్ఘంగా చర్చలు జరిపామన్నారు. అసలు జరిగిన ఈ గొడవ అంతటికీ మూల కారణం అగ్రవర్ణాలు దళిత ఉపాధ్యాయులు పట్ల వ్యవహరిస్తున్న తీరే అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనమాల.గురవయ్య, పులి శ్రీకాంత్ ,చందమామల కోటయ్య, ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు చారులత తదితరులు పాల్గొన్నారు.

## పొలం బాట కార్యక్రమంలో రెడ్డివారి

ఏర్పేడు మార్చి 13 ప్రభాతవార్త :



శుక్రవారం అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా ఏర్పేడు మండలంలో పొలం బాట కార్యక్రమాన్ని రాష్ట్ర అధికార ప్రతినిధి,ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు, ఏర్పేడు మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు , ఏర్పేడు పాక్స్ ఛైర్మన్ మహేష్ రెడ్డి , సీనియర్ నాయకులు నైనూరు పున్నారావు, గుణా యాదవ్, క్రిష్ణప్ప, రాచటి సుబ్రహ్మణ్యం, నారాయణ, కెకె రావు రమణ, సీతాపతి ఆచారి, రవినాయుడు, మనోహర్ నాయుడు తదితరులు పాలుగున్నారు.

## అసత్య ఆరోపణలు మానుకోవాలి




సూళ్లూరుపేట, మార్చి 13 ప్రభాతవార్త: అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న తనపై, తన కుటుంబంపై చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నిరాధారమైన ఆరోపణలు చేస్తూ ప్రజలను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. స్వర్ణముఖి నదిని తవ్వేస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందని చెప్పారు. అలాగే టిడ్కో ఇళ్ల ప్రారంభం విషయంలో కూడా ఆయన మాట్లాడిన తీరు సక్రమంగా లేదని విజయశ్రీ అన్నారు. అనంతరం ప్రజల నుంచి ఆమె వినతిపత్రాలు స్వీకరించి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో హెచ్‌పివి వ్యాక్సిన్ మహిళలకు అందించే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సిఎస్ ఛైర్మన్ ఎజి కిషోర్, సీనియర్ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, వేమసాని శ్రీనివాసులునాయుడు, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాణాసంచా తయారీ నిందితుడు అరెస్ట్



తడ, మార్చి 12 ప్రభాతవార్త: ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతులు లేకుండా బాణాసంచా తయారీ చేస్తున్న యువకుడును తడ పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఈ విషయంపై నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు సూళ్లూరుపేట సిఐ మురళీకృష్ణ విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి కేసు వివరాలను తెలియజేశారు. సూళ్లూరుపేట పరిసర ప్రాంతాలలో ఆపరేషన్ వజ్రప్రహార్ పేరుతో ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా తడ మండలం అక్కంపేట గ్రామ పరిధిలో ప్రియదర్శిని కాలేజ్ సమీపంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా బాణాసంచా తయారు చేస్తున్న నిందితుడును అదుపులోకి తీసుకున్నామని తడ ఎస్సై కొండప్ప నాయుడు వారి సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా తనిఖీల్లో నిందితుడు వద్దనుండి బాణాసంచా తయారీకి ఉపయోగించే ముడి సరుకులు స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా బాణాసంచా తయారీని గుర్తించడం ద్వారా ప్రమాదాన్ని అరికట్టగలిగామని ఎస్సై కొండప్ప నాయుడు వారి సిబ్బందిని డీఎస్పీ చెంచు బాబు అభినందించారు.

## సూళ్లూరుపేటలో అన్నదాత సుఖీభవ



సూళ్లూరుపేట, మార్చి 13 ప్రభాతవార్త : నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ పథకం కింద 26 వేల 500 మంది రైతులకు 15 కోట్ల 19 లక్షల 22 వేల రూపాయలను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా అందజేశారు. శుక్రవారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు రైతుల అకౌంట్‌లోకి నేరుగా మూడో విడతగా ఈ నగదును జమ చేసినట్లు తెలిపారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేసేది కూటమి ప్రభుత్వమని చెప్పారు. ప్రస్తుతం సూళ్లూరుపేట నియోజకవర్గంలో పంటలు బాగా పండాయని, రైతులకు మంచి దిగుబడులు వచ్చాయని తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి తక్షణమే నగదు అందజేయడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉత్తమ రైతులను ఆమె సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్, బెస్త కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మన శ్రీధర్, ఎఫ్ఎసిఎస్ ఛైర్మన్ ఎజి కిషోర్, పార్టీ సీనియర్ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆర్డీఓ దేవేంద్రరెడ్డి, ఆత్మ జిల్లా స్థాయి అధికారి ఎ.రాజ్‌కుమార్, ఎఓ కాంచన తదితరులు పాల్గొన్నారు.

## మన్నారుపోలూరు హైస్కూలులో సరస్వతీపూజ



సూళ్లూరుపేట, మార్చి 13 ప్రభాతవార్త: మున్సిపాలిటీ పరిధిలోని మన్నారు పోలూరు హైస్కూలులో 10వ తరగతి విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుక్రవారం సరస్వతీ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో ఎంతో కష్టపడి చదివారని, పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించడంతో పాటు హైస్కూలుకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులచే సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు.

## బాలికలకు టీకాలు



వాకాడు, మార్చి 13 ప్రభాతవార్త: వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం గ్రామంలోని శుక్రవారం డాక్టర్ తులసీదాస్ పర్యవేక్షణలో సర్పంచి ఇన్నమాల రమణమ్మ చేతుల మీదుగా బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం బాలికలకు టీకాలు వేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ తులసీదాస్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు హెచ్‌పివి వ్యాక్సిన్ ఓపెనింగ్ చేసి అర్హులైన బాలికలకు టీకాలు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. మండలంలోని ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు కమలాక్షి, పుష్పలత, సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ కృష్ణ, ఎంఎల్ హెచ్‌పిఎస్, ఏఎన్ఎమ్స్, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు అంబలి,మజ్జిగ పంపిణీ



వాకాడు, మార్చి 13, ప్రభాతవార్త మండల కేంద్రమైన వాకాడు అశోక పిల్ల సెంటర్ సమీపంలో శుక్రవారం కనుపూరు ముత్యాలమ్మ తల్లి జాతర మహోత్సవం సందర్భంగా నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి భక్తులకు అంబలి, మజ్జిగ చలివేంద్రం కార్యక్రమం చేపట్టారు. నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కనుపూరు ముత్యాలమ్మ జాతర మహోత్సవం సందర్భంగా వచ్చి వెళ్లే భక్తులకు అంబలి మజ్జిగ తప్పనిసరిగా ఏర్పాటు చేస్తామన్నారు, దారి మధ్యలోని భక్తులకు చలివేంద్రంతో పాటు పలుచోట్ల ఆహార పొట్లాలు, అంబలి మజ్జిగ వాటర్ ప్యాకెట్లు భక్తులకు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

## వేగంగా వెళుతున్న లారీని ఢీకొన్న కారు ముగ్గురు గాయాలు



పెళ్లకూరు, మార్చి 13, ప్రభాతవార్త: నాయుడుపేట - పూతలపట్టు 71 నెంబర్ జాతీయ రహదారిపై గుర్రపు తోట సమీప ప్రాంతంలో శుక్రవారం మధ్యాహ్నం అరుణాచలం నుండి తెనాలి వైపు వెళుతున్న కారు ముందు వెళ్తున్న లారీని వేగంగా ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న అభినవ్ (24), వంశీ (25), గౌతం (24) ముగ్గురు యువకులు అదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం నుండి తప్పించుకుని గాయాలతో బయటపడ్డారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో విషయం తెలుసుకున్న అంబులెన్స్ వెంటనే ప్రమాద స్థలానికి చేరుకుని క్షతగాత్రులను నాయుడుపేటలోని ట్రినిటీ ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించారు. విషయం తెలుసుకున్న పెళ్లకూరు పోలీసులు హాస్పటల్ వద్దకు చేరుకొని క్షతగాత్రుల వివరాలు తెలుసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## పేటలో సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా




నాయుడుపేట, మార్చి 13 ప్రభాతవార్త : మున్సిపాలిటీలో పనిచేసే మున్సిపల్ కార్మికులు శుక్రవారం కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. సిఐటియు ఆధ్వర్యంలో ధర్నాను నిర్వహించారు. ధర్నాలో మున్సిపల్ కార్మికులు నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి వొడ్డిపల్లి వెంకటయ్య మీడియాతో మాట్లాడారు. గత 8 నెలలుగా మున్సిపల్ కార్మికులకు జీతాలు ఇవ్వడంలో కమిషనర్ షేక్ ఫజులుల్లా జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. కార్మికులకు జీతాలతో పాటు నాన్ ఆప్కాస్ కార్మికులను ఆప్కాస్ గుర్తించాలని ఆయన కార్యాలయం ముందు డిమాండ్ చేశారు. కరోనా కష్టకాలంలో మున్సిపల్ కార్మికులను ఆప్కాస్ చేస్తామని మాట ఇచ్చి వారి వద్ద పనులు చేయించుకుని ఇప్పుడు ఆ మాట కాస్త తప్పి ఆప్కాస్ కు కార్మికులను ఎక్కించకుండా మున్సిపల్ కమిషనర్ లంచాలకు పాల్పడుతున్నాడంటూ ఆయన దుమ్మెత్తి పోశారు. మున్సిపల్ కార్మికులకు ఏ నెలకి అ నెలా జీతాలు చెల్లించమని జీవోలు చెబుతుంటే నిబంధనలు కాస్త తుంగలో తొక్కి డబ్బు చెల్లించకుండా కార్మికుల ఇబ్బందులు పాలు చేస్తున్నారని మండిపడ్డారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన కోరికలను తీర్చే అంతవరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట సిపిఎం పార్టీ కార్యదర్శి శివకవి, ముకుంద, కార్మికులు పాల్గొన్నారు.

## మేనకూరు ఇన్రా్ఫ కంపెనీలో విషాదం

**- కార్మికుడు మృతి**

నాయుడుపేట, మార్చి 13, ప్రభాతవార్త నాయుడుపేట సమీపంలోని మేనకూరు ప్రాంతంలో ఉన్న ఇన్రా్ఫ కంపెనీలో విషాద ఘటన చోటుచేసుకుంది. కంపెనీలో పనిచేస్తున్న రాజ్‌కుమార్ (32) అనే కార్మికుడు పనిలో ఉండగానే జరిగిన ప్రమాదంలో మృతి చెందినట్లు సమాచారం. శుక్రవారం పనులు నిర్వహిస్తున్న సమయంలో అకస్మాత్తుగా ప్రమాదం సంభవించడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారని సహచర కార్మికులు తెలిపారు.వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ చికిత్స పొందుతూ ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది.ఈ ఘటనతో సహచర కార్మికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రమాదానికి కారణాలు ఏమిటన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. కంపెనీలో భద్రతా చర్యలు సరిగా అమలు చేస్తున్నారా. లేదా అనే అంశంపై కార్మికులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

## సిలిండర్ల కృత్రిమ కొరత వినియోగదారుల అవస్థలు

తడ, మార్చి 13 ప్రభాతవార్త : అంతర్జాతీయ పరిణామాల సాకుతో గ్యాస్ ఏజెన్సీలు సిలిండర్ల కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. వినియోగదారులకు సరైన సమాచారం ఇవ్వక గ్రామాలకు గ్యాస్ అందకపోవడంతో వినియోగదారులు సిలిండర్ కోసం గోడౌన్ల వద్ద వేచి చూడాల్సి పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వాలు ఇంటి వినియోగానికి గ్యాస్‌కి సరఫరా ఇబ్బందులు ఉండవని చెబుతున్నప్పటికీ, గ్యాస్ ఏజెన్సీలు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు కమర్షియల్ వినియోగానికి సిలిండర్లు కొరత ఏర్పడడంతో ఇంటి వినియోగానికి అందవలసిన సిలిండర్లు వ్యాపారస్తులకు చేరుతున్నాయని ఆరోపణలు పిలిపిస్తున్నాయి. తడ హెచ్‌పి గ్యాస్ఏజెన్సీ గోడన్లు చేనిగుంట వద్ద శుక్రవారం వినియోగదారులు పడిగాపులు కాయవలసిన పరిస్థితి ఏర్పడింది. సూళ్లూరుపేట గ్యాస్ ఏజెన్సీలో గ్యాస్ సరఫరా సక్రమంగా ఉన్నట్లు సమాచారం. అయితే తడ ఏజెన్సీలో సమస్య ఎక్కువగా ఉంది. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తనిఖీలు లేకపోవడం వల్లే గ్యాస్ కొరత ఏర్పడిందని వారు ఆరోపిస్తున్నారు. ఈ సమస్య పరిష్కారానికి అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## కూటమి ప్రభుత్వం...రైతు పక్షపాతి

**-ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్**




పుత్తూరు (నగరి), మార్చి 13 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల పట్ల సానుకూలంగా వ్యవహరిస్తూ రైతు పక్షపాతిగా కూటమి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ తెలిపారు. శుక్రవారం నగరి పట్టణంలో అన్నదాన సుఖీభవ - పిఎం కిసాన్ మూడో విడత కింద నగరి నియోజకవర్గంలోని 20,063 మంది రైతులకు రూ. 11.27 కోట్ల చెక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఏడాది రైతుకు రూ. 20,000 వేలు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ. 6000 వేలు ఇస్తుండగా, తమిళనాడు, కేరళ, తెలంగాణా, కర్నాటక తదితర దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆ డబ్బుతోనే సరిపెడుతున్నాయని తెలిపారు. కేంద్రం ఇచ్చే రూ. 6000 వేలకు అదనంగా చంద్రబాబునాయుడు రూ. 14,000 వేలు కలిసి ప్రతి ఏడాది క్రమం తప్పకుండా రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా 47 లక్షల రైతు కుటుంబాలకు బాసటగా వున్నారని తెలిపారు. పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం పాడి రైతులకు రూ. 2.10 లక్షల విలువ చేసే ఒకొక్క గోకులం షెడ్‌ను 90 శాతం సబ్సిడీతో నిర్మించుకునేందుకు అవకాశం కల్పించామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గంలోని పాడి రైతులందరికీ గోకులం షెడ్‌లు మంజూరు చేశామని తెలిపారు. పక్కనే వున్న తెలంగాణాలో తీవ్ర ఎరువుల కొరత వున్న నేపథ్యంలో మన రాష్ట్రంలో మాత్రం ఎరువులకు కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలైన రోడ్లు, లైట్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేస్తున్నందున నియోజకవర్గంలో ఏ పల్లెకు వెళ్లినా పండగ వాతావరణంకనిపిస్తోందన్నారు. త్వరలోనే నింద్ర, విజయపురం మండలాల్లో అన్ని రోడ్లను నిర్మిస్తామని తెలిపారు. సమావేశంలో వ్యవసాయాధికారులు, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హైలెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వే నిర్మాణానికి చర్యలు తీసుకుంటా!

**-విజయ్‌బాబుకు ఆర్అండ్‌బి మంత్రి హామీ**



పుత్తూరు, మార్చి 13 ప్రభాతవార్త : నగరి నియోజకవర్గంలో రోడ్లు, భవనాల శాఖకు సంబంధించి రెండు హై లెవల్ బ్రిడ్జిలు, ఒక కాజ్ వే పనులను పూర్తి చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు ఆర్అండ్‌బి శాఖ మంత్రి బి.సి.జనార్ధనరెడ్డిని కోరారు. ఈ మేరకు విజయవాడలో శుక్రవారం మంత్రిని కలిసి ఒక వినతిపత్రం సమర్పించారు. నగరి పట్టణ పరిధిలోని అరక్కోణం-రేణిగుంట రోడ్డులో 29/6-10 కిలోమీటరు వద్ద కుశస్థలి నదిపై హై లెవల్ బ్రిడ్జి, చెక్ డ్యామ్ నిర్మించాలని కోరారు. కుశస్థలి నదిపై ఈ రోడ్డులో చాలా సంవత్సరాల క్రితం నిర్మించిన కాజ్ వే వర్షాలకు కొట్టుకుపోయిందని తెలిపారు. అయితే తాత్కాలికంగా కాజ్ వే నిర్మించినప్పటికీ, ఈ రోడ్డుపై శాశ్వత ప్రాతిపదికన హై లెవల్ బ్రిడ్జి నిర్మించాల్సిన అవసరం వుందన్నారు. అలాగే నియోజకవర్గంలోని పుత్తూరు పట్టణంలో అనంతపురం-చెన్నై రోడ్డులోని 317/8 కిలోమీటరు వద్ద వున్న ఉప్పు కాల్వపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాల్సి వుందన్నారు. పుత్తూరు నుంచి తిరుపతికి రాకపోకలు సాగించే మార్గంలో ఓవర్ బ్రిడ్జికి 150 కిలోమీటర్ల దూరంలో ప్రస్తుతం వున్న ఇరుకైన బ్రిడ్జి వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా వుందన్నారు. తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నందున ఈ ప్రాంతంలో కూడా హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. వడమాలపేట పట్టణ పరిధిలోని చీమలవారి వాగు వద్ద 308/4 కిలోమీటరు వద్ద రైల్వే బ్రిడ్జి కింద లో-లెవల్ కాజ్‌వే వర్షాల కారణంగా పూర్తి స్థాయిలో దెబ్బతిందన్నారు. వడమాలపేట నుంచి రామచంద్రాపురం వరకూ ఈ రోడ్డు లింక్ రోడ్డుగా వుందన్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా మరమ్మతులకు గురైన ఈ లోలెవల్ కాజ్ వే నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని రెండు హై లెవల్ బ్రిడ్జిలు, ఒక కాజ్ వే నిర్మాణానికి తాను ఇచ్చిన విజ్ఞప్తికి మంత్రి సానుకూలంగా స్పందించి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లోనే ఈ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్టు విజయ్‌బాబు తెలిపారు.

## రైతుల పక్షపాతి సిఎం చంద్రబాబు

**- ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ , మాజీ ఎమ్మెల్సీ గౌరివారి శ్రీనివాసులు**



**- రైతులకు 19.80కోట్ల చెక్కు పంపిణీ !!**

శాంతిపురం, మార్చి 13 ప్రభాతవార్త: రైతుల పక్షపాతి సిఎం చంద్రబాబు నాయుడు అని ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం శాంతి పురంలో నియోజకవర్గంలోని 36473మంది రైతులకు అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకంలో మంజూరైన 19.80కోట్ల చెక్కులను ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, కడ పి.డి. వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ కంచర్ల మాట్లాడారు. కుప్పం ప్రాంత రైతులకోసం కుప్పానికి హంద్రీ-నీవా కాలువల ద్వారా కృష్ణాజలాలు తెచ్చారన్నారు. సిఎం చంద్రబాబు కృషితో ప్రస్తుతం 150చెరువులు నిండాయని త్వరలోనే అన్ని చెరువులు నింపడం జరుగుతుందన్నారు. కుప్పంలో పాల పరిశ్రమ అభివృద్ధికి చర్యలు చేపట్టారన్నారు. ఇప్పటికే ఐదు లక్షల లీటర్ల ఉత్పత్తి అవుతోందన్నారు. కుప్పంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను సైతం సిఎం చంద్రబాబు తీసుకువస్తున్నారన్నారు. కుప్పాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనేది సిఎం ఆలోచన అన్నారు. రైతుబిడ్డ అయిన సిఎం చంద్రబాబు రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, కార్మిక బోర్డు సభ్యుడు విశ్వనాథ్‌నాయుడు, పిఎసిఎస్ ఛైర్మన్ గోపాల్, కడ సభ్యురాలు సుగుణమ్మ, నేతలు మణి, హరి, నాగరాజు, గోవిందరాజులు, రాజే ంద్ర,బసవరాజు, తులసినాథ్, కాశీనాథ్, నామాలప్ప, గజే ంద్రకుమార్, శకు ంతల, శ్యామలమ్మ, జనసేన నేతలు పాల్గొన్నారు.

## నిద్రలేమి అనేక రోగాలకు దారితీస్తోంది

**-డాక్టర్ రమాదేవి గౌరనేని**




రేణిగుంట మార్చి 13 ప్రభాతవార్త సరైన సమయానికి నిద్ర రాకపోతే అది అనేక రకాల మానసిక శారీరక రోగాలకు దారితీస్తుందని అమర ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ రమాదేవి గౌరినేని ఉద్ఘాటించారు. రేణిగుంట మండలం కరకంబాడి అమర ఆసుపత్రిలో శుక్రవారం అంతర్జాతీయ స్లీప్ డే సందర్భంగా ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో చాలామందికి గురక, నిద్రలేమి, స్లీప్ అప్నియా సమస్యలు వయసుతో సంబంధం లేకుండా వస్తున్నాయి అన్నారు. వీటివల్ల గుండె, మెదడు, నరాల సంబంధిత వ్యాధులు, రక్తపోటు, మధుమేహం, వివిధ రకాల రకాల మానసిక ఒత్తిడీలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతిరోజు 7నుండి 8 గంటలు తప్పనిసరిగా నిద్రపోవాలన్నారు. వరల్డ్ స్లీప్ డే సందర్భంగా మార్చి 16, 18, 23, 25, 26 తేదీల్లో ఉచితంగా స్లీప్, ఇఎన్టి కన్సల్టేషన్ ఉచితంగా అందిస్తున్నామన్నారు. వైద్య పరీక్షల్లో 20శాతం రాయి కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి చీఫ్ బిజినెస్ ఆఫీసర్ వేణుగోపాల్, పిఆర్వో మునినాదం, మార్కెటింగ్ మేనేజర్ హేమ కుమార్, విజయ శంకర్, దివ్య, మమత, మానస తదితరులు పాల్గొన్నారు..

## గ్రామాల్లో రైతులు అనందం కోసంమే కూటమి : ఎంఎల్ఏ




శ్రీకాళహస్తి,మార్చి 13 ప్రభాతవార్త: గ్రామాల్లో రైతుల కళ్ళలో అనందం చూడటమే లక్ష్యంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ పరిపాలన సాగిస్తున్నారని ఈ నేపథ్యంలోనే రైతన్నను ఆదుకోవటానికి 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని తీసుకువచ్చారన్నారు. శుక్రవారం సాయంత్రం వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన అన్నదాత సుఖీభవ చెక్కుల పంపిణి కార్యక్రమాలకు వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి, శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి ఛైర్మెన్ చెంచయ్యానాయుడు, పార్టీ నాయకులు తాటిపర్తి రవీంద్రరెడ్డి, బత్తిరెడ్డి,తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఈ ఏడాది వరి పంట బాగా పండిందన్నారు. దిగుబడికూడా గణనీయంగా ఉందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వెసులుబాట్లు ఎంతో సహాయంగా ఉన్నాయని రమేష్‌రెడ్డి వివరించారు. ఈ సభలో ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభాన్ని గుర్తించిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అదుకొనుటకు ఏటా రూ.20వేలు వారి ఖాతాల్లో జమచేయటానికి నిర్ణయించి వారి ఖాతాల్లో వేస్తున్నారన్నారు. నేడు రాష్ట్రంలో రైతు పక్షపాత ప్రభుత్వం నడుస్తుందని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమాల్లో రూ.53కోట్లు 70లక్షలు రైతులకు అందించారన్నారు. అంతేకాక గ్యాస్‌కు సంబంధించి ఆపోహలను ప్రజలు విడనాడాలని సుధీర్‌రెడ్డి సూచించారు.

## ముంబై ఎగ్జిబిషన్‌లో కూల్‌సిటీగా మెరిసిన శ్రీసిటీ







సత్యవేడు, మార్చి 13 ప్రభాతవార్త: ముంబైలో ఈ నెల 12,14 తేదీల్లో జరుగుతున్న ఏసీఆర్ఈఎక్స్ ఇండియా 2026 ఎగ్జిబిషన్‌లో కూల్ సిటీగా శ్రీసిటీ ప్రత్యేక ఆకర్షణగానిలిచింది. శ్రీసిటీలోని పలు ప్రముఖ ఏసీ కంపెనీలు, ఇతర అనుబంధ పరిశ్రమలు ఈ ప్రదర్శనలో పాల్గొని హెచ్‌వీఏసీ అండ్ ఆర్ తయారీ కేంద్రంగా శ్రీసిటీ ప్రాధాన్యతను చాటాయి. దక్షిణ ఆసియాలో హెచ్‌వీఏసీ అండ్ ఆర్ రంగానికి సంబంధించిన ప్రముఖ ఎగ్జిబిషన్‌గా గుర్తింపు పొందిన ఏసీఆర్ఈఎక్స్ ఇండియా 2026 అనే సంస్థ నిర్వహిస్తోంది. ప్రపంచ వ్యాప్త తయారీ సంస్థలు, ఆవిష్కరణలు, విధాన రూకర్తలు, పరిశ్రమ ప్రముఖులు తమ అత్యాధునిక సాంకేతికతలు, పర్యావరణహిత పరిష్కారాలు, భవిష్యత్ వ్యవస్థ మార్పులను పరిచయం చేయడానికి ఇదొక మంచి వేదికగా నిలుస్తుందన్నారు. దీనిపై శ్రీఇసిటీ మేనేజింగ్ డైరెక్టర్ వీరంద్ర సన్నారెడ్డి స్పందిస్తూ శ్రీసిటీలోని హెచ్‌వీఏసీ పారిశ్రామిక అనుకూల వాతావరణ ప్రదర్శనతో పాటు పరిశ్రమల మధ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి ఈ ఎగ్జిబిషన్ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఎగ్జిబిషన్‌లో శ్రీసిటీస్టాల్‌లో ప్లగ్ అండ్ ప్లే మౌలిక సదుపాయాలు, పోర్ట్ ఆధారిత లాజిస్టిక్స్ అనుకూలతలు, నైపుణ్య మానవ వనరులు, సమగ్ర రవాణా అనుసంధానం వంటి శ్రీసిటీ పారిశ్రామిక వాడ ప్రత్యేకతలతో పాటు పలు ఏసీ కంపెనీల ఉత్పత్తుల నమూనాలను ప్రదర్శించారు. శ్రీసిటీలో ప్రస్తుతం డైకిన్, ఎల్‌జీ, హావెల్స్, బ్లూ స్టార్,అంబర్ ఎంట్రప్రెసెస్, హైసెన్స్, థుర్మాక్స్, క్యారియర్ వంటి ప్రముఖసంస్థలతో పాటు నైడెక్ పానాసోనిక్ లైఫ్ సొల్యూషన్స్ అదెలా ఎల్రక్టానిక్స్ సహా మొత్తం 32 విడి భాగాల సరఫరాకంపెనీలు ఏర్పాటై, దేశంలో అతి పెద్ద ఏసీల తయారీ హబ్‌గా మారుతోందని మరోసారి ఈ ఎగ్జిబిషన్ ద్వారా రుజువైంది.

## నాయనూరులో కేంద్ర బృందం పర్యటన



కుప్పం, మార్చి 13 ప్రభాతవార్త: మండలంలోని నాయనూరు గ్రామంలో శుక్రవారం కేంద్ర పంచాయతీరాజ్ శాఖకు చెందిన ఇద్దరు అధికారుల బృందం పర్యటించింది. ఈసందర్భంగా వారు గ్రామంలో వివిధ కార్యక్రమాల అమలుపై ఏర్పాటు చేసిన పదిస్టాల్స్‌ను పరిశీలించారు. అలాగే పంచాయతీలోని గ్రామాలు, నాయనూరు గ్రామంలో ఉన్న పాఠశాల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీలో చెత్తసేకరణ విధానంపై ఆరా తీశారు. కాగా పంచాయతీలో జరుగుతున్న కార్యక్రమాలపై కేంద్ర బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. కాగా వచ్చే నెలలో నాయనూరు పంచాయతీ జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీ పురస్కారాన్ని అందుకోనుంది. కార్యక్రమాల్లో జడ్పీ సిఇఒ రవికుమార్ నాయుడు, డిపిఒ సుధాకర్‌రావు, ఎంపిడిఒ వెంకటేశ్వర్లు, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, సర్పంచ్ కావ్య, జిల్లా అధికార ప్రతినిధి సా ంబశివం, మాజీ ఎంపిటిసి మురుగేష్, కార్యదర్శులు నరేష్,రమ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ద్రవిడ వర్సిటీ వైస్‌చాన్సలర్‌గా... ప్రొ॥చిన్నమల్లయ్య నియామకం



కుప్పం, మార్చి 13 ప్రభాతవార్త : ద్రవిడ విశ్వవిద్యాలయం నూతన వైస్ చాన్సలర్‌గా ఆచార్య చిన్నమల్లయ్య లక్కినేని నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం రాష్ట్ర గవర్నర్ తరపున ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య చిన్నమల్లయ్య ప్రస్తుతం హైదరాబాద్ యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ డెవలప్‌మెంట్ ఎకనామిక్స్ విభాగంలో పనిచేస్తున్నారు.ఆచార్య చిన్నమల్లయ్య మూడేళ్ల కాలం పాటు వైస్‌చాన్సలర్‌గా కొనసాగుతారు. కాగా గత వైసిపి ప్రభుత్వ హయాంలో వైస్‌చాన్సలర్‌గా నియమితులైన ప్రొఫెసర్ ఆశాజ్యోతి కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే పదవికి రాజీనామా చేశారు. అనంతరం వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్‌గా ఆచార్య ఎం.దొరస్వామి కొనసాగారు. ప్రస్తుతం నూతనంగారెగ్యులర్ వైస్‌చాన్సలర్‌ను ప్రభుత్వం నియమించింది.

**LOST CERTIFICATE**

I, **KAVALI HARI PRAKASH,** Aged 30 years resident of VAKADU near Ashok Pillar centre. On 11th March 2026, I, was carrying a bag in which my NIR CALICUT ORIGINAL DEGREE CERTIFICATE bearing Roll No: B130850CE passing year 2017 in Dept Civil Engineering was present. I stopped in Vakadu Xerox shop for some work keeping my bag in the bike. Later I went to VAKADU, MRO office for work. When I reached home I realised that bag is lost. I couldn't fine my bag after thorough searching. If anyone fine the above said document. Please contact **KAVALI HARI PRAKASH 9398028609**

**మునిసిపల్ కార్యాలయము, పుత్తూరు**

ఆర్.ఓ.నెం.459/ఇ1/2024 తేది : 13.03.2026

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు**

పుత్తూరు పురపాలక సంఘము నందు 15h Finance Commission Grants నుండి 3 పనులకు, జనరల్ ఫండ్స్ నుండి 2 పనులకు మొత్తం 5 పనులకు (టెండరు నిట్ నెం.100/2025-26 నుండి 102/2025-26, 85/2025-26 (2nd Call) & 98/2025-26 (2nd Call) అర్హతలు కలిగినవారు నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది. సదరు పనులకు సంబంధించిన పూర్తి వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ నందు చూడవలెను. http:// tender.apeprocurement.gov.in

**కమిషనర్, పుత్తూరు మునిసిపాలిటి, పుత్తూరు**